

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 02-02-2026 | సంపుటి - 26 | సంచిక -254 | రూ : 4 | పేజీలు: 8





2లో

## హైదరాబాద్ నుంచి హై స్పీడుగా..

- చెన్నై, బెంగళూరు, ముంబయి వంటి నగరాలకు 350 కి.మీ. వేగంతో ప్రయాణం
- మూడు వైపులా హైస్పీడ్ రైలు కారిడార్లు ప్రకటించిన కేంద్రం

## సామాన్యులకు సున్నా

- దీర్ఘకాలిక పురోగతిని లక్షిస్తూ కేంద్ర బడ్జెట్
- జనాకర్షక ప్రకటనలకు దూరం
- తయారీరంగంలో ఉద్యోగాల సృష్టికి అధిక ప్రాధాన్యం
- మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట
- మునుపెన్నడూ లేనంతగా మూలధన వ్యయానికి రూ.12.22 లక్షల కోట్లు
- ఆదాయపు పన్ను శ్లాబుల్లో మార్పుల్లేవ్
- రక్షణ రంగానికి కేటాయింపులు 15% పెంపు



2లో

- వీబీ- జీ రామ్ జీ పథకానికి రూ.95,692 కోట్లు
- సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌ను ముందుకు తీసుకెళ్తామన్న నిర్మల

## ఎలిమినేటర్‌కు ఢిల్లీ

- యూపీపై విజయం
- ముంబయి ఔట్



2లో



2లో

## భగ్గుమన్న గులాబీ దళం

- కేసీఆర్‌పై సిట్ విచారణకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు
- రాష్ట్రవ్యాప్తంగా భారాస శ్రేణుల బైక్ ర్యాలీలు, రాస్తారోకోలు
- ముఖ్యమంత్రి దిష్టిబొమ్మల దహనం
- పలు చోట్ల ఉద్రిక్తత



## నాలుగు లక్షల ఇందిరమ్మ ఇళ్లకు పీఎంఏవై నిధులు



2లో

- పట్టణాల్లో రూ.1.50 లక్షలు, గ్రామాల్లో రూ.72 వేలు ఇవ్వనున్న కేంద్రం

## సుప్రీం అంటే మీరేనా?

- మీ ఆదేశాలతోనే ఫోన్ ట్యాపింగ్ జరిగిందా?
- నందినగర్‌లోని నివాసంలో కేసీఆర్‌ను నాలుగున్నర గంటలపాటు విచారించిన సిట్
- ప్రశ్నలు సంధించిన ఆరుగురు అధికారులు
- సిట్ సేకరించిన ఆధారాలతో ప్రశ్నలు.. ఎదురు ప్రశ్నించిన కేసీఆర్
- విచారణ సమయంలో ఇంటిబయట ఉద్రిక్తత, కార్యకర్తల నిరసనలు



2లో



2లో

### 'స్కిల్' కేసులో

## చంద్రబాబుకు ప్రమేయం లేదు

- ఆయన పాత్రపై ఎలాంటి ఆధారాలూ లభించలేదు
- ఏ నేరాదాయ సంబంధిత ప్రక్రియలోనూ లేరు
- అందుకే ఈ కేసులో నిందితుడిగా చేర్చలేదు..
- తాజా అనుబంధ అభియోగపత్రంలో ఈడీ వెల్లడి

# సామాన్యులకు సున్నా...

అంతర్జాతీయంగా అనిశ్చితి మేఘాలు కమ్ముకున్నా.. అభివృద్ధి పథంలో దేశాన్ని వేగంగా పరుగులు తీయించాలన్న సంకల్పంతో మోదీ సర్కారు బృహత్ ప్రణాళికను రూపొందించింది! తయారీ రంగంలో స్వావలంబనతో సుస్థిర వృద్ధికి బాటలు పరిచే కార్యాచరణను సిద్ధం చేసింది!! స్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్లు పూర్తయ్యేనాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా నిలపాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్న ప్రభుత్వం.. ఆ లక్ష్య సాధనకు అనుగుణంగా తీర్చిదిద్దిన కేంద్ర బడ్జెట్ (202627)ను ఆదివారం పార్లమెంటు ముందుంచింది. దీర్ఘకాల ఆర్థిక వృద్ధికి దన్నుగా నిలిచే మౌలిక వసతుల అభివృద్ధికి తాము ఎంతగా ప్రాధాన్యమిస్తున్నదీ భారీ కేటాయింపులతో చాటిచెప్పింది. ఔషధాలు, సెమీకండక్టర్లు సహా మొత్తం ఏడు రంగాల్లో ఉద్యోగాల సృష్టి, ఉత్పాదకత పెంపుపై ప్రత్యేకంగా దృష్టిసారించనున్నట్లు ప్రకటించింది. మొత్తం రూ.53.47 లక్షల కోట్ల ఈ కేంద్ర పద్దులో.. రక్షణ, గ్రామీణాభివృద్ధి సహా పలు రంగాలకు కేటాయింపులు నిరుటితో పోలిస్తే గణనీయంగా పెరిగాయి. ఆదాయపు పన్ను రేట్లను మాత్రం యథాతథంగా ఉంచారు. కొత్త ఆదాయపు పన్ను చట్టం2025 ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి



అమల్లోకి రానుంది.

**ఉపాధి కల్పన.. ఉత్పాదకత పెంపు**

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం ఉదయం తొలుత రాష్ట్రపతి భవన్‌కు వెళ్లి.. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిశారు. బడ్జెట్ ప్రతులను ఆమెకు అందజేశారు. అనంతరం అక్కడి నుంచి లోక్‌సభకు వచ్చి.. రికార్డు స్థాయిలో వరుసగా తొమ్మిదోసారి కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. విత్త క్రమశిక్షణను పాటిస్తూ.. తాత్కాలిక ప్రయోజనాలకు కాకుండా, దీర్ఘకాలిక వృద్ధికి పద్దులో నిర్మల ప్రాధాన్యమిచ్చారు. పర్యాటకం, ఔషధ ఉత్పత్తి, రక్షణ తదితర రంగాల్లో దేశాన్ని అగ్రగామిగా నిలబెట్టే ప్రణాళికలను ఇందులో పొందుపరిచారు. దాదాపు 90 నిమిషాలపాటు ఆమె ప్రసంగించారు. ట్రంప్ సుంకాల బెదిరింపులతో ప్రపంచవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతుండటం, సరఫరా గొలుసులకు అంతరాయాలు ఏర్పడుతుండటం, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ కుదుపులకు లోనవుతుండటం వంటి పరిణామాలను దృష్టిలో పెట్టుకొని బడ్జెట్‌లో నిర్మల కీలక ప్రకటనలు చేశారు. ఉపాధి కల్పన, ఉత్పాదకత పెంపు, సాంకేతికత ఆధారిత అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ.. ఔషధాలు, సెమీకండక్టర్లు, రేర్ ఎర్త్ మ్యాగ్నెట్‌లు, రసాయనాలు, క్యాపిటల్ గూడ్స్, జౌళి, క్రీడా సాధనాల ముడిపదార్థాల వంటి రంగాల్లో స్వదేశంలో ఉత్పత్తి సామర్థ్యాన్ని భారీగా పెంచుతామన్నారు. దేశీయంగా ఐఫోన్ తయారీ విజయవంతమైన నేపథ్యంలో.. ఎలక్ట్రానిక్స్ తయారీకి కేటాయింపులను నిరుటితో పోలిస్తే ఈ బడ్జెట్‌లో రెట్టింపు చేస్తున్నట్లు ప్రకటించారు. మొత్తం రూ.40 వేల కోట్లను అందుకు కేటాయిస్తున్నట్లు తెలిపారు.

**రయ్‌రయ్ రైల్వే**

గత రెండేళ్లూ రైల్వేకు ఒకే స్థాయిలో నిధులు కేటాయించిన నిర్మలమ్మ.. ఈసారి కేటాయింపులను 10 శాతానికి పైగా పెంచారు. దేశంలో ఏడు హైస్పీడ్ రైల్వే కారిడార్ల ఏర్పాటుకు సంకల్పించారు. వీటిలో మూడు హైదరాబాద్ నుంచి ఉంటాయి. పశ్చిమ బెంగాల్‌లోని డాంకునీ, గుజరాత్‌లోని సూరత్ మధ్య నిర్మించే నడవాను సరకు రవాణాకు ప్రత్యేకంగా కేటాయిస్తారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన వీబీ జీ రామ్ జీ పథకానికి రూ.95,692 కోట్లు కేటాయించారు. చేపల పెంపకం, పాడి వంటి వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సహించేలా ముఖ్యమైన ప్రకటనలు చేశారు. భారత్ నుంచి అంతర్జాతీయంగా డేటా సెంటర్ సర్వీసులను అందించే విదేశీ సంస్థలకు 20 ఏళ్లపాటు పన్ను విరామం ప్రకటించడం తాజా బడ్జెట్‌లోని మరో కీలకాంశం. జీఎస్టీ సరళీకరణ, నూతన కార్మిక చట్టాల రూపకల్పన సహా 350కిపైగా సంస్కరణలను తాము ఇప్పటికే అమల్లోకి తీసుకొచ్చామని.. సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌ను ఇదే జోరుతో ముందుకు తీసుకెళ్తామని నిర్మల చెప్పారు.

**పటిష్ఠ 'రక్షణ'**

రక్షణ రంగంలో ఆధునికీకరణకు అగ్రతాంబూలమిస్తూ.. ఆ శాఖకు కేటాయింపులను నిరుటితో పోలిస్తే ఈసారి పద్దులో ఏకంగా 15% పెంచారు. స్టెమ్ కోర్సులను అభ్యసించే విద్యార్థినులకు ఇబ్బందులు తలెత్తకుండా నివారించేందుకు జిల్లాకో వసతిగృహం ఏర్పాటుచేస్తామని, స్వయంసహాయక సంఘాల సభ్యురాళ్లను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం కోసం 'షీమార్ట్'లను ఏర్పాటుచేస్తామని ప్రకటించి.. మహిళా సంక్షేమంపై తమ చిత్తశుద్ధిని కేంద్రం చాటుకుంది. భారత్‌ను బయోఫార్మా తయారీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రాబోయే ఐదేళ్లలో రూ.10 వేలకోట్ల పెట్టుబడులు పెట్టనున్నారు. రోగులకు భారీ ఊరటనిస్తూ 17 క్యాన్సర్ ఔషధాలపై దిగుమతి సుంకాన్ని తొలగించింది. ఆహారం, ఇంధనం, ఎరువులపై రాయితీల కోసం చేయబోయే వ్యయంలో కేంద్రం నిరుటితో పోలిస్తే 4.47% కోత విధించింది.

# ఎలిమినేటర్‌కు దిల్లీ

వడోదర: దిల్లీ క్యాపిటల్స్ జట్టు డబ్ల్యూపీఎల్ సీజన్4లో ఎలిమినేటర్‌కు అర్హత సాధించింది. ఆఖరి లీగ్ మ్యాచ్‌లో యూపీ వారియర్స్‌ను 5 వికెట్ల తేడాతో ఓడించిన ఆ జట్టు మొత్తం 8 పాయింట్లతో పట్టికలో మూడో స్థానంలో నిలిచి, ముందంజ వేసింది. ముంబయి (6), యూపీ (4) జట్లు టోర్నీ నుంచి నిష్క్రమించాయి. ఆదివారం మొదట యూపీ 8 వికెట్లకు 122 పరుగులే చేయగలిగింది. మరిజేన్ కాప్ (3/30), శ్రీచరణి (2/22), షినెలి హెన్రీ (2/25) ఆ జట్టును దెబ్బతీశారు. 24 పరుగులు చేసిన దీప్తి శర్మ టాప్‌స్కోరర్. స్వల్ప ఛేదనలో దిల్లీ కూడా చెమటోడ్చింది. 18.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి కష్టంగా లక్ష్యాన్ని అందుకుంది. లారా వోల్వార్ట్ (47; 36 బంతుల్లో 7×4), జెమీమా (34 నాటౌట్; 18 బంతుల్లో 5×4) షెఫాలి వర్మ (29; 33 బంతుల్లో 2×4) రాణించారు. దిల్లీ ఓడిపోయి ఉంటే ముంబయి ముందంజ వేయగలిగేది. పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన బెంగళూరు (12) నేరుగా ఫైనల్‌కు అర్హత సాధించిన సంగతి తెలిసిందే. రెండు, మూడు స్థానాల్లో నిలిచిన గుజరాత్, దిల్లీ మంగళవారం ఎలిమినేటర్‌లో తలపడతాయి. ఇందులో గెలిచిన జట్టు గురువారం జరిగే ఫైనల్లో బెంగళూరును ఢీకొంటుంది.

సంక్షిప్త స్కోర్లు... యూపీ వారియర్స్: 122/8 (దీప్తి శర్మ 24, శిఖ పాండే 23 నాటౌట్, సిమ్రన్ 22; మరిజేన్ కాప్ 3/30, శ్రీచరణి 2/22, షినెలి హెన్రీ 2/25); దిల్లీ క్యాపిటల్స్: 18.4 ఓవర్లలో 126/5 (వోల్వార్ట్ 47, షెఫాలి వర్మ 29, జెమీమా 34 నాటౌట్; దీప్తి శర్మ (2/27), శిఖ పాండే (1/17), సోఫీ ఎకిల్‌స్టోన్ (1/20)

# భగ్గుమన్న గులాబీ దళం

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో భాగంగా.. భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సిట్ విచారించడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా భారాస శ్రేణులు ఆదివారం పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టాయి. సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా రాస్తారోకోలు చేశారు. ముఖ్యమంత్రి దిష్టిబొమ్మలను దహనం చేశారు. మోటార్ సైకిల్ ర్యాలీలు చేపట్టారు. నల్లజెండాలు ధరించి నినాదాలు చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్ వద్దకు భారీగా భారాస నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి.. నినాదాలు చేశారు. హైదరాబాద్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. నందినగర్‌లోని కేసీఆర్ నివాసం వద్దకు వెళ్లబోయిన కార్యకర్తలను పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. నిరసనగా నల్ల జెండాలతో ఆందోళన చేపట్టారు. రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. తెలంగాణభవన్‌లో సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, తలసాని, మధుసూదనాచారి, కేపీ వివేకానంద, మాధవరం కృష్ణారావు, రాగిడి లక్ష్మారెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కేసీఆర్‌పై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు.

# నాలుగు లక్షల ఇందిరమ్మ ఇళ్లకు పీఎంఏవై నిధులు

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఆశించిన స్థాయిలో కాకున్నా ఓ మోస్తరుగా ఇందిరమ్మ ఇళ్లకు కేంద్రం వాటా అందనుంది. ఒక్కో ఇంటికి..పట్టణాల్లో అయితే రూ.1.50 లక్షలు, గ్రామాల్లో రూ.72 వేల చొప్పున కేంద్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కోసం అందించనుంది. పట్టణాలు, గ్రామాల్లో కలిపి 202627 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 13 లక్షల ఇళ్లకు కేంద్రం వాటా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేయగా సుమారు 4.13 లక్షల ఇళ్లకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద నిధులు అందే అవకాశాలున్నాయి. పీఎంఏవై అర్బన్ 2.0 పథకంలో భాగంగా కేంద్రం 202627 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి 1.13 లక్షల ఇళ్లు కేటాయించనుంది. ఇప్పటికే ఈ పథకంలో భాగంగా పదివేల ఇళ్లను రాష్ట్రానికి కేంద్రం కేటాయించింది. మరో 1.03 లక్షల ఇళ్లకుగాను..పట్టణంలో ఒక్కో ఇంటికి రూ.1.50 లక్షల చొప్పున రూ.1,690 కోట్లను అందించనుంది. పీఎంఏవై అర్బన్ పథకంలో భాగంగా గతంలో రెండు పడకల గదుల ఇళ్లను నిర్మించగా..వీటికి సంబంధించి సుమారు 33 వేల ఇళ్లకు కేంద్ర తన వాటా కింద మరో రూ.500 కోట్ల నిధులు కేటాయించే అవకాశాలున్నాయి.

పీఎంఏవై గ్రామీణ పథకంలో భాగంగా సుమారు 25 లక్షల ఇళ్లకు వాటా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతోంది. ప్రస్తుతం కేటాయించిన నిధుల దృష్ట్యా సుమారు 3 లక్షల ఇళ్లు వచ్చే అవకాశాలున్నాయని రాష్ట్ర హౌసింగ్ శాఖ అంచనా వేస్తోంది. ఈ మేరకు కేంద్రం నుంచి ఒక్కో ఇంటికి రూ.72 వేల చొప్పున రూ.2,160 కోట్లు నిధులు రాష్ట్రానికి వచ్చే అవకాశాలున్నాయి. గ్రామీణం పథకంలో భాగంగా ఆదివాసీల కోసం 10 వేల ఇళ్లను కేంద్రం అందించనుంది. ఈ నిమిత్తం ఒక్కో ఇంటికి రూ.1.20 లక్షలను అందిస్తుంది. ఇప్పటికే ఈ ఇళ్లు మంజూరు చేస్తూ కేంద్రం పచ్చజెండా ఊపింది.

# హైదరాబాద్ నుంచి హై స్పీడుగా..

హైదరాబాద్: అత్యాధునిక, అత్యంత వేగవంతమైన బుల్లెట్ రైళ్లు అనగానే చైనా, జపాన్‌లనే గుర్తుచేసుకుంటాం. కొన్నేళ్లలో భారతదేశం పేరు కూడా ఈ జాబితాలో చేరనుంది. ప్రస్తుతం ముంబయిఅహ్మదాబాద్‌ల మధ్య హైస్పీడ్ కారిడార్ నిర్మాణ పనులు జరుగుతుండగా.. ఇప్పుడు ఏకంగా ఏడు హైస్పీడ్ కారిడార్ ప్రాజెక్టుల్ని మంజూరు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటించింది. ఈ హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్‌లో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరం కేంద్ర బిందువుగా మారనుంది. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన ఏడు హైస్పీడ్ రైలు కారిడార్లలో మూడు ఇక్కడి నుంచే ప్రారంభం కానుండటం విశేషం. హైదరాబాద్ నుంచి చెన్నై, బెంగళూరు, పుణె నగరాలకు ఈ ప్రాజెక్టులను చేపట్టనున్నారు. ఇవి కార్యరూపం దాల్చితే రవాణా ఆధారిత అభివృద్ధి పరుగులు పెట్టే అవకాశం ఉంది. తెలుగు రాష్ట్రాల్లోని నగరాలు, పట్టణాల మధ్య రాకపోకలు వేగవంతమవుతాయి.

*** కర్నూలుకు గంట.. అమరావతికి 75 నిమిషాలు**

దేశంలో వేగవంతమైన రైలు ప్రయాణం కోసం రాజధాని, శతాబ్ది, తాజాగా వందేభారత్ రైళ్లు వచ్చాయి. వందేభారత్ సీటింగ్ రైళ్ల గరిష్ఠ వేగం 150 కి.మీ. కాగా త్వరలో ప్రవేశపెట్టనున్న స్లీపర్ రైలుకు ఇటీవల ట్రయల్ రన్ నిర్వహించగా 180 కి.మీ. వేగం అందుకుంది. దేశ రైలు చరిత్రలో ఇదే అత్యధిక వేగం. హైస్పీడ్ కారిడార్ రైలు ప్రాజెక్టులను 350 కి.మీ. వేగాన్ని తట్టుకునేలా డిజైన్ చేస్తున్నారు. ఇందులో రైళ్ల ఆపరేషనల్ స్పీడ్‌ను గంటకు 320 కి.మీ.గా నిర్ణయించారు. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి బెంగళూరు, చెన్నై, పుణె నగరాలకు రైల్లో చేరుకునేందుకు 1215 గంటల సమయం పడుతుండగా.. హైస్పీడ్ కారిడార్ కార్యరూపం దాలిస్తే 3 నుంచి 3.5 గంటల్లోనే చేరుకోవచ్చు. హైస్పీడ్ కారిడార్‌లో గరిష్ఠ వేగం 350 కి.మీ. ఉన్నప్పటికీ మలుపులు, స్టాపేజీలు వంటి అంశాల్ని పరిగణనలోకి తీసుకుంటే సగటు వేగం గంటకు 200 నుంచి 250 కి.మీ. ఉండే అవకాశాలున్నాయి. హైదరాబాద్ నుంచి ఖమ్మం, కర్నూలు వంటి నగరాలకు గంటలో చేరుకోవచ్చు. ఏపీ రాజధాని అమరావతికి సుమారు 75 నిమిషాలు, అనంతపురానికి 90 నిమిషాల సమయం పట్టొచ్చు.

**చిన్న నగరాలు, పట్టణాల్లోనూ స్టాపేజీలు**

బుల్లెట్ రైళ్లు అనగానే మహానగరాల్లోనే ఆగుతాయన్న భావన ఉంది. ఈ ప్రాజెక్టుల్లో చిన్న నగరాలు, జిల్లా కేంద్రాలు, పట్టణాల్లోనూ స్టాపేజీలను గుర్తించారు. తెలంగాణలో నార్కట్‌పల్లి, వనపర్తి రోడ్డు, శంషాబాద్ వంటి పట్టణాలు.. సూర్యాపేట, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లా కేంద్రాల్లో ఆగనున్నాయి. ఏపీలో చీరాల, కావలి, గూడూరు వంటి పట్టణాల్లోనూ స్టేషన్లు నిర్మించనున్నారు. హైస్పీడ్ కారిడార్ పూర్తిగా గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టు. ప్రస్తుత రైల్వేలైన్లతో సంబంధం లేకుండా కేవలం వీటి కోసమే కొత్తగా నిర్మిస్తారు. పశువులు, అటవీ జంతువులు అడ్డు రాకుండా ఫెన్సింగ్ వంటి రక్షణ ఏర్పాట్లు చేస్తారు.

**కీలకదశలో తుది ఎలైన్‌మెంట్**

హైదరాబాద్‌ముంబయి హైస్పీడ్ కారిడార్‌కు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను ఇప్పటికే రైల్వేబోర్డుకు సమర్పించారు. మధ్యలో జహీరాబాద్, కలబురిగి, శోలాపూర్, పంఢార్‌పూర్, అక్లుజ్, దౌండ్, పుణె, లోనావాలాలో స్టేషన్లలో ప్రతిపాదించారు. అయితే తాజా కేంద్ర బడ్జెట్‌లో హైదరాబాద్‌పుణె, పుణెముంబయి పేరిట రెండు హైస్పీడ్ కారిడార్లుగా విభజించింది. ముంబయి పుణె మధ్య ఘాట్ ప్రాంతం ఉండటంతో ప్రత్యేక ప్రాజెక్టుగా చేపడుతున్నట్లు సమాచారం. హైదరాబాద్‌చెన్నై ఎలైన్‌మెంట్‌ను రైల్వేశాఖ శంషాబాద్, నార్కట్‌పల్లి, సూర్యాపేట, ఖమ్మం నుంచి ఏపీలో అమరావతి మీదుగా ప్రతిపాదించింది. తెలంగాణ ప్రభుత్వం మాత్రం ఫ్యూచర్‌సిటీ, మిర్యాలగూడ ప్రాంతం నుంచి అమరావతి వైపు ప్రతిపాదించింది. వీటిపై స్పష్టత రావాల్సి ఉంది. రైల్వేబోర్డుకు డీపీఆర్ సమర్పించేందుకు నెలాఖరు వరకు సమయం ఉంది. హైదరాబాద్‌బెంగళూరు మార్గంలో శంషాబాద్, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్ మీదుగా రైల్వేశాఖ ప్రతిపాదించింది. మన్ననూరు, శ్రీశైలం మార్గంలో చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించినప్పటికీ ఈ మధ్యలో పెద్ద పట్టణాలు, నగరాలు లేకపోవడంతోపాటు టైగర్‌రిజర్వు ఉండటంతో మహబూబ్‌నగర్ మీదుగా ఎలైన్‌మెంట్ ఖరారుకానున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్టు డీపీఆర్ సమర్పించేందుకూ మార్చి నెలాఖరు వరకు సమయం ఉంది. తాజా ప్రాజెక్టులతో హైదరాబాద్‌కు బెంగళూరు, చెన్నై, ముంబై వంటి మెట్రో నగరాలతోపాటు.. పుణె, అమరావతి, కర్నూలు, ఖమ్మం, తిరుపతి, నెల్లూరు, అనంతపురం, కలబురిగి, శోలాపూర్ వంటి నగరాలకు వేగవంతమైన రైలు కనెక్టివిటీ అందుబాటులోకి వస్తుంది. ఈ ప్రాజెక్టులతో భారీగా ఉపాధి అవకాశాలూ లభిస్తాయి. అయితే భూసేకరణ చిక్కులు, రూ.లక్షల కోట్ల వ్యయం వంటి అంశాల నేపథ్యంలో పూర్తయ్యేందుకు చాలా ఏళ్లు పట్టే అవకాశాలున్నాయి. ౦ంబయిఅహ్మదాబాద్ హైస్పీడ్ కారిడార్ సాధ్యాసాధ్యాల అధ్యయనం 2015లో పూర్తికాగా.. ఏడేళ్లలో అంటే 2022 నాటికి నిర్మాణం పూర్తవుతుందని అనుకున్నారు.

# 'స్కిల్' కేసులో చంద్రబాబుకు ప్రమేయం లేదు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ 201419 మధ్య చేపట్టిన సీమెన్స్ ప్రాజెక్టు నిధులు దుర్వినియోగమయ్యాయనే ఆరోపణలపై నమోదైన కేసులో.. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఏ ప్రమేయమూ లేదని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తేల్చిచెప్పింది. ఈ కేసులో నేరాదాయానికి (ప్రొసీడ్స్ ఆఫ్ క్రైమ్) సంబంధించిన ఏ ప్రక్రియలోనూ, కార్యకలాపాల్లోనూ ఆయన పాత్ర లేదని కుండబద్దలు కొట్టింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద చేపట్టిన దర్యాప్తులో ఈ కేసులో చంద్రబాబు పాత్ర ఉన్నట్లు ఏ ఆధారాలూ లభించలేదని నిర్ధారించింది. అందుకే ఆయన్ను నిందితుడిగా చేర్చలేదని స్పష్టం చేసింది. విశాఖపట్నంలోని పీఎంఎల్ఏ కోర్టులో 2023 మే 1న దాఖలుచేసిన ప్రధాన అభియోగపత్రం, తాజాగా సమర్పించిన అదనపు అభియోగపత్రంలో ఈడీ ఈ విషయాల్ని వెల్లడించింది. సీమెన్స్ ప్రాజెక్టు నిధుల దుర్వినియోగం ఆరోపణలపై 2021 డిసెంబరులో పెట్టిన కేసులో చంద్రబాబును ప్రధాన నిందితుడిగా (ఏ1) చేర్చి విజయవాడలోని ఏసీబీ కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశామంటూ ఏపీ సీఐడీ 2024 ఏప్రిల్‌లో తమకు లేఖ రాసిందని.. అయితే పీఎంఎల్ఏ కింద తాము నమోదు చేసిన కేసులో చంద్రబాబు పాత్ర ఎక్కడా తేలలేదని అనుబంధ ఛార్జ్‌షీట్‌లో వివరించింది. వైకాపా, దాని అనుబంధ ముఠాలు ఇన్నాళ్లుగా చంద్రబాబు చేస్తున్నవన్నీ దుష్ప్రచారాలేనని తేటతెల్లమైంది.

*** చంద్రబాబును ఇరికించాలనే దురుద్దేశంతో..**

సీమెన్స్ ప్రాజెక్టులో నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ 2021 డిసెంబరులో సీఐడీ కేసు నమోదు చేసింది. నైపుణ్యాభివృద్ధి సంస్థలో పనిచేసిన అధికారులతో పాటు సీమెన్స్ ప్రాజెక్టు అమలు చేసిన వివిధ సంస్థల ప్రతినిధుల్ని నిందితులుగా చేర్చింది. ఈ కేసులో మనీ లాండరింగ్ వ్యవహారాలు వెలుగు చూశాయంటూ తర్వాత ఆ ఎఫ్ఐఆర్‌ను ఈడీకి పంపించింది. దాని ఆధారంగా ఈడీ కూడా.. 2022 డిసెంబరులో ఈసీఐఆర్ఐ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. అయితే ఆ కేసులో చంద్రబాబు నిందితుడు కాదు. నాటి ముఖ్యమంత్రి జగన్ కక్ష సాధింపులో భాగంగా.. సీఐడీ నమోదు చేసిన కేసులో 2023 సెప్టెంబరులో చంద్రబాబును నిందితుడిగా చేరుస్తూ.. ఏసీబీ కోర్టులో మెమో దాఖలుచేసిన సీఐడీ అధికారులు వెంటనే చంద్రబాబును అరెస్టు చేశారు. రాజమహేంద్రవరం జైల్లో 53 రోజుల పాటు నిర్బంధించారు. తర్వాత సీఐడీ 2024 ఏప్రిల్‌లో విజయవాడ ఏసీబీ కోర్టులో అభియోగపత్రం దాఖలు చేసి చంద్రబాబును ప్రధాన నిందితుడిగా పేర్కొంది. ఆయన్ను ఈడీ కేసులోనూ ఇరికించాలనే దురుద్దేశంతో జగన్ హయాంలోనే ఈ విషయాలన్నీ ఈడీకి పంపించారు. తమ దర్యాప్తులో వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న ఈడీ అసలు ఈ కేసులో చంద్రబాబు పాత్రే లేదని తేల్చి చెప్పేసింది. ఈడీ నమోదు చేసిన కేసులో చంద్రబాబు ఎన్నడూ నిందితుడిగా లేరు. అయినా సరే వైకాపా ముఠా పదేపదే ఆయన్ను ఈ కేసుకు ముడిపెడుతూ దుష్ప్రచారం చేసింది.

*** ఆ సంస్థల అంతర్గత వ్యవహారాల్లో మనీలాండరింగ్..**

సీమెన్స్ ప్రాజెక్టు అమలుకు సంబంధించి ఏపీ ప్రభుత్వం నుంచి వివిధ సంస్థలకు నిధులు విడుదలైన తర్వాత.. వాటి ప్రతినిధులు డొల్ల కంపెనీల ద్వారా వాటిని దారి మళ్లించుకున్నారని దర్యాప్తులో తేలినట్లు ఈడీ స్పష్టం చేసింది.

# సుప్రీం అంటే మీరేనా?

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును సిట్ అధికారులు విచారించారు. ఆదివారం హైదరాబాద్‌లోని నందినగర్‌లో తన సొంత నివాసంలో ఆయన్ను నాలుగున్నర గంటల పాటు ప్రశ్నించారు. ఈ సమయంలో ఇంటి బయట వేలాది మంది కార్యకర్తల నిరసనలు, నినాదాలు చేశారు. భారీ బందోబస్తు మధ్య ఆరుగురు సిట్ అధికారులు ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించారు. విచారణ పర్వం పూర్తిగా వీడియో రికార్డింగ్ చేశారు. అధికారులు అడిగిన పలు ప్రశ్నలకు నేరుగా సమాధానమిచ్చిన కేసీఆర్ మరికొన్నింటికి ఎదురు ప్రశ్నించారు. ఒక సందర్భంలో ఇదంతా సిల్లీ వ్యవహారమనీ, కేవలం రాజకీయ కక్షతోనే సాగిస్తున్న డ్రామా అంటూ ఆయన అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. సిట్ ఇచ్చిన నోటీసుల మేరకు... కేసీఆర్ ఆదివారం భారీ కాన్వాయ్‌తో ఎర్రవల్లి ఫామ్‌హౌస్ నుంచి మధ్యాహ్నం 12.30గంటల సమయంలో నందినగర్ నివాసానికి చేరుకున్నారు. ఇతరులు అటువైపు రాకుండా కేసీఆర్ నివాస పరిసరాల్లో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. నగర స్పెషల్ బ్రాంచ్ జాయింట్ కమిషనర్ విజయ్ కుమార్, మహేశ్వరం డీసీపీ నారాయణరెడ్డి, గ్రేహౌండ్స్ కమాండెంట్ రవీందర్ రెడ్డి, కూకట్‌పల్లి డీసీపీ రితురాజ్, శంషాబాద్ అదనపు ఎస్పీ ఎఎస్ రావు, ఏసీపీలు శ్రీధర్ రికార్డింగ్ పరికరాలతో ఆయన నివాసానికి చేరుకున్నారు. రెండో అంతస్తులో వెయిట్‌చేస్తున్న సిట్ అధికారుల వద్దకు న్యాయవాదులతో కలిసి మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో కేసీఆర్ వచ్చారు. విచారణ గదిలోకి న్యాయవాదులను అనుమతించ లేదు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు మొదటి అంతస్తులో ఉండి పరిస్థితిని సమీక్షించారు. మధ్యాహ్నం 3.10గంటలకు విచారణ ప్రారంభించారు. ఫోన్ ట్యాపింగ్ జరుగుతున్నట్టు మీకు ముందుగానే తెలుసా..? మీకు అవసరమైన వ్యక్తుల సమాచారం కోసం వారి ఫోన్లు ట్యాపింగ్ చేయమని అప్పటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావును ఆదేశించారా? ఈ విషయంలో అప్పటి టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావును కూడా ఉపయోగించుకున్నారా? అనే ప్రశ్నలతో అధికారులు విచారణను ప్రారంభించినట్టు తెలిసింది. అయితే, ఉదయమే ఇంటెలిజెన్స్ అధికారులు సీఎంగా ఉన్న తనను కలిసి శాంతిభద్రతల సమాచారం చెప్పేవారనీ, ఆ సమాచారం ఎలా సేకరించారనే విషయం తనకు అప్రస్తుతమని కేసీఆర్ చెప్పినట్టు తెలిసింది. దేశ భద్రత, ప్రభుత్వ సుస్థిరత, మావోయిస్టుల కదలికలపై ఇంటెలిజెన్స్ అధికారులు ఫోన్ ట్యాపింగ్ చేస్తుంటారు.

## నాయకపోడు నిరుద్యోగ యువతకు గురు–శిష్య హస్తశిల్ప శిక్షణ కార్యక్రమం ప్రారంభం

*** జిల్లా కలెక్టర్ జితిష్ వి. పాటిల్**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం మాదారం గ్రామంలో ఏర్పాటు చేసిన నాయకపోడు మాస్కుల తయారీ యూనిట్‌ను జిల్లా కలెక్టర్ జితిష్ వి. పాటిల్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా యూనిట్‌లో తయారవుతున్న నాయకపోడు మాస్కుల తయారీ ప్రక్రియను పరిశీలించి, కళాకారులతో పరస్పరంగా మాట్లాడి వారి అనుభవాలు, సమస్యలు, అవసరాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మాదారం గ్రామంలో తయారవుతున్న నాయకపోడు మాస్కులు నాయకపోడు సంస్కృతి, సంప్రదాయ హస్తకళలకు రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు తీసుకువస్తున్నాయని తెలిపారు. ఈ సంప్రదాయ కళను పరిరక్షిస్తూ మరింత అభివృద్ధి చేయడంతో పాటు, మండలంలోని నాయకపోడు నిరుద్యోగ యువతీ-యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో "గురు-శిష్య హస్తశిల్ప శిక్షణ కార్యక్రమం"ను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. ఈ శిక్షణ కార్యక్రమం సోమవారం నుంచి ప్రారంభమవుతుందని, తొలి దశలో 30 మంది నాయకపోడు నిరుద్యోగ యువతీ-యువకులకు రెండు నెలలపాటు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. శిక్షణకు హాజరయ్యే ప్రతి శిక్షణార్థికి రోజుకు రూ.300 చొప్పున స్కాలర్‌షిప్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ కాలంలో సంప్రదాయ నాయకపోడు మాస్క్ తయారీతో పాటు నాణ్యత మెరుగుదల, ఆధునిక డిజైన్‌లు, మార్కెటింగ్ అంశాలపై ప్రాయోగిక అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. శిక్షణ పూర్తయిన అనంతరం శిక్షణార్థులు స్వయం ఉపాధి, ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు ఏర్పాటు చేసుకునేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం ద్వారా అందజేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. సంప్రదాయ హస్తకళలకు మార్కెట్ అవకాశాలు పెంచడంతో పాటు స్థానిక యువతకు స్థిరమైన ఉపాధి కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి డీఆర్‌డీఏ ఏపీఎం ఆర్. ఉపేందర్ పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారని తెలిపారు. మాస్టర్ క్రాఫ్ట్ పర్సన్ అంజన్ కుమార్ శిక్షణను అందిస్తారని, గురు-శిష్య విధానంలో ప్రాయోగికంగా నైపుణ్యాలు నేర్పిస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ క్రాఫ్ట్ పర్సన్ అంజన్ కుమార్, డీఆర్‌డీఏ ఏపీఎం రామ్ కుమార్, సీసీ ఉపేందర్, మాస్క్ తయారీ యూనిట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 56వ డివిజన్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి బండారి రజిత ఇంటింటి ప్రచారం



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 56వ డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బండారి రజిత ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అమలు కాని హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండున్నర సంవత్సరాలుగా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందని విమర్శించారు. మళ్లీ ఎన్నికల వేళ ప్రజలను మోసం చేయడానికి కాంగ్రెస్ నాయకులు వస్తున్నారని, వారి మాటలను నమ్మి మరోసారి మోసపోవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. అభివృద్ధి, సంక్షేమానికి బీఆర్ఎస్ పార్టీ మాత్రమే సరైన ప్రత్యామ్నాయమని పేర్కొంటూ, కార్పొరేషన్‌లో మరోసారి గులాబీ జెండా ఎగురవేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ ఇంటింటి ప్రచార కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రుక్మాంగాధర్ బండారి, రాజు, తిరుపతి, మనోజ్, భాస్కర్, సృజన తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ద్వాదశ జ్యోతిర్లింగాల మహా పడిపూజ



కూకట్ పల్లి, ప్రజాస్ఫూర్తి : కూకట్‌పల్లి నియోజకవర్గం భరత్ నగర్ కాలనీలోని హరిహరక్షేత్రం లో మాఘ పౌర్ణమి సందర్భంగా గురు స్వామి నరసింహ ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగాల మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ పవిత్ర పూజా కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు నాగిరెడ్డి, వికే రావు, జి.ఎల్. రెడ్డి తో పాటు స్థానిక భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో భక్తులు స్వామివారి ఆశీస్సులు పొందుతూ, మాఘ పౌర్ణమి ఉత్సవాన్ని ఆధ్యాత్మికంగా ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, గురుస్వామి, నాగరాజు, మహేష్, రమేష్, శ్రావణ్, వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో పౌర్ణమి వేడుకలు



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : పౌర్ణమి సందర్భంగా జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలో మగ్దూం నగర్ లో శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో కుటుంబ సమేతంగా బీఆర్ఎస్ యువజన నాయకులు కొలుకుల జైహింద్ పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారి కృప కటాక్షాలతో జగద్గిరిగుట్ట డివిజన్ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు ఈ కార్యక్రమంలో. ఆలయ కమిటీ అధ్యక్షులు. సుజిత్ కుమార్. వైస్ ప్రెసిడెంట్. రాజు. కమిటీ సభ్యులు. రాములు భాస్కర్ దినేష్ విటల్ కిషన్ నాగేష్. విట్టల్ గౌడ్. సాయిలు యాదవ్.రాజు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి కే. సీ. ఆర్ ని సిట్ విచారణ పేరుతో అగౌరవ పరచడమే

*** బీఆర్ఎస్ నాయకులు**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే. సీ. ఆర్ ని సిట్ విచారణ పేరుతో అగౌరవ పరచడమేనని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ప్రభుత్వ నియంతృత్వ పోకడలకు వ్యతిరేకం గా రంగారెడ్డినగర్ డివిజన్ రంగారెడ్డి నగర్ చౌరస్తా లో బీ. ఆర్. ఎస్ కార్యకర్తలు రోడ్డు పై బైటాయించి నిరసన వ్యక్తం చేసారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమం లో డివిజన్ అధ్యక్షులు ఎర్వ శంకరయ్య, కార్యదర్శి సుధాకర్, మల్లేష్, నాయకులు జల్దా లక్ష్మి నాథ్, ఎండీ గౌసోద్దీన్,షకీల్, రాణి, ఈశ్వరి,రాజేష్ గౌడ్,అలాఉద్దీన మేరీ,యాది రెడ్డి, సురేష్, వేణు,సాయి,కరుణ,హర్షిత, శోభ, శాంతి, సలాఉద్దీన్, ప్రభాకర్ చారి, సంపత్ అజీమ్ తదితరులు పాల్గొన్నారు.



## చదువుతోనే సమాజంలో మార్పు సాధ్యం

*** ముస్తాబాద్ ఎస్ ఐ గణేశ్**
*** ముస్తాబాద్‌లో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ పోస్టర్ ఆవిష్కరణ**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: చదువుతోనే సమాజంలో మార్పు సాధ్యమని ముస్తాబాద్ ఎస్ ఐ గణేశ్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల పదవ తరగతి విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ చేపట్టిన 'మిషన్ 10వ తరగతి' ప్రోగ్రాం పోస్టర్‌ను ముస్తాబాద్ ఎస్ ఐ గణేశ్ ఆదివారం పోలీస్ స్టేషన్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ ఐ గణేశ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని గవర్నమెంట్ స్కూల్స్ విద్యార్థుల టాలెంట్‌ను ఎంకరేజ్ చేసేందుకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ వారు ఈ కార్యక్రమం చేపట్టడం చాలా అభినందనీయమని కొనియాడారు. ఎడ్యుకేషన్‌తోనే సొసైటీలో చేంజ్ సాధ్యమవుతుందని, టాలెంటెడ్ స్టూడెంట్స్‌కు ఇలాంటి స్కీమ్స్ గొప్ప సపోర్టుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ మిషన్ ద్వారా స్టేట్ వైడ్ మొత్తం రూ.2.2 కోట్ల క్యాష్ ప్రైజెస్ అందజేయనున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా ఫస్ట్ ప్లేస్ సాధించిన స్టూడెంట్‌కు రూ.5 లక్షలు, సెకండ్ ప్లేస్ వారికి రూ.3 లక్షలు, ప్రతి జిల్లా టాపర్‌కు రూ.2 లక్షలు, 119 అసెంబ్లీ కాన్‌స్టిట్యూయెన్సీ టాపర్లకు రూ.1 లక్ష చొప్పున, అలాగే 612 మండలాల టాపర్లకు రూ.10 వేల చొప్పున నగదు బహుమతులు లభిస్తాయని తెలిపారు. ఈ బెనిఫిట్ కేవలం తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2026 మార్చిలో టెన్త్ క్లాస్ ఎగ్జామ్స్ రాసే విద్యార్థులకు మాత్రమే వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు. గవర్నమెంట్‌తో పాటు ఇలాంటి ప్రైవేట్ ఆర్గనైజేషన్స్ విద్యారంగానికి హెల్ప్ చేయడం గర్వకారణమని, విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని ఫుల్ లెవల్‌లో యూటిలైజ్ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ మేనేజర్ అనిల్ కుమార్, ఎగ్జిక్యూటివ్‌లు చింతాకుల ప్రశాంత్, కొమ్ము వెంకటేశ్, ఉమేష్, డిఓ చెవుల మల్లేశ్, కరెండ్ల మల్లారెడ్డి, అదే కిషన్, ఎస్ ఓ నర్సింలు, ఐలాపోరం సంతోష్ తదితరులున్నారు.



## వైభవంగా శ్రీ శ్రీ శ్రీ బాల మురుగన్ కుమారస్వామి తైపోత్సవం

జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్‌నగర్ డివిజన్ లోని సుభాష్‌నగర్ లో తమిళయన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కొట్టాయి స్వామి అధ్యక్షతన తమిళయన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాల మురుగన్ కుమారస్వామి పళని లో తైపోత్సవం పూజ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కుమార స్వామి వల్లిని దేవి కళ్యాణ మహోత్సవం, శ్రీ శ్రీ శ్రీ బాల మురుగన్ కుమారస్వామి తైపోత్సవం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా తమిళయన్స్ అసోసియేషన్ ముఖ్య నాయకులు మాట్లాడుతూ బాలమురుగన్ స్వామివారి పూజలు పళని లో జరిగేటట్టు సుభాష్‌నగర్ లో ఉదయం నుండి కావడి ఊరేగింపుతో విచ్చేసి బాల మురుగున స్వామి ప్రత్యేకంగా అభిషేకాలు పూజలు , కళ్యాణం చేయటం జరిగింది అని తెలిపారు. ఈ పూజ వేడుకల్లో స్థానిక బిజెపి నాయకులు భారతసింహ రెడ్డి, వాసు లు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజ వేడుకల్లో రాజకీయ నాయకులు సుభాష్‌నగర్ డివిజన్ ముఖ్య నాయకులు , ప్రముఖులు తో పాటు తమిళయన్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి. కొటస్వామి, వైస్ ప్రెసిడెంట్ ఆర్.గణేశన్, జనరల్ సెక్రటరీ కె. చిన్న స్వామి,ట్రెసారార్ టి.భాస్కర్, జాయింట్ సెక్రటరీ ఎస్ ఆనందం , తమిళయన్స్ అసోసియేషన్ తో పాటు స్థానికులు మహిళలు ,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మా మనోభావాలు దెబ్బతీస్తే ఊరుకునేది లేదు బిఎస్ఎఫ్ కన్వీనర్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి



బోడుప్పల్, ప్రజాస్ఫూర్తి : మా బతుకుల గురించి మాటలు మాట్లాడుతూ ప్రతిరోజు ఇబ్బంది పెట్టే విధంగా కొంతమంది నాయకులు పనిచేస్తున్నారని మా మనోభావాలు దెబ్బతీసే విధంగా పనిచేస్తే ఊరుకోమని బోడుప్పల్ సెటిలర్స్ ఫోరం కన్వీనర్ యెడ్ల శ్రీనివాసరెడ్డి మండిపడ్డాడు. శనివారం బోడుప్పల్ సర్కిల్లోని అభిరుచి హోటల్ లొ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం పలువురు సభ్యులు మాట్లాడుతూ అందరము ఐకమత్యంగా ఉంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు . ఈ కార్యక్రమంలో కో కన్వీనర్లు శ్రీనివాస్ గుప్తా , అమర్, లింగారెడ్డి, హల్వా శ్రీనివాస్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌కు సిట్ నోటీసులపై ముస్తాబాద్‌లో నిరసన

*** ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ ముస్తాబాద్ మండల కేంద్రంలో రాజకీయ సెగలు రాజుకున్నాయి. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు బీఆర్ ఎస్ శ్రేణులు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించి, కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ ఎస్ మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్ రావు, పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నరసింహారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షతోనే కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టాలని చూస్తోందని మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయలేక, ఆ వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికే ఇలాంటి కుట్రలకు తెరలేపారని ధ్వజమెత్తారు. రైతులకు కనీసం యూరియా కూడా అందించలేని ఈ ప్రభుత్వం, ఫోన్ ట్యాపింగ్ పేరిట అక్రమంగా వ్యవహరించడం హాస్యాస్పదమని వారు పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సర్వర్ పాషా, సంతోష్ రావు, నల్ల నరసయ్య, శీలం స్వామి, మెంగని మనోహర్, గూడూరు భరత్, కంచం నర్సింలు, అన్వర్ ప్రశాంత్ తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో ఉద్యోగులకు బదిలీలు సహజం...

*** జోగిపేట బిఎంసీయూ విజయ డైరీ ఇంచార్జీ మేనేజర్ నికిత...**



అందోలు, ప్రజాస్ఫూర్తి: విధి నిర్వహణలో ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని జోగిపేట బిఎంసీయూ విజయ డైరీ ఇంచార్జీ మేనేజర్ నికిత అన్నారు. ఆదివారం జోగిపేట లో విజయ డైరీ బిఎంసియు ఆవరణలో ఇంచార్జీ మేనేజర్ నికిత మరియు బిఎంసియూ పరిధిలోని ఆయా గ్రామాల పాల సేకరణ కేంద్రాలకు సంబంధించిన పాడి ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుల ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడా మేనేజర్ గా విధులు నిర్వహించి కామారెడ్డి జిల్లాకు బదిలీపై వెళ్లిన మేనేజర్ రంజిత్ కుమార్ ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఏ ఉద్యోగంలోనైనా బదిలీలు సహజమని, కానీ తాను చేసే పనితీరుపు బట్టి అక్కడి ప్రజల మనసులో ఉండిపోతారన్నారు. డైరీ మేనేజర్ గా రంజిత్ కుమార్ అరేళ్ల పాటు విజయ డైరీ ఉద్యోగులతోపాటు, పాడి రైతులతో కలిసి డైరీని విజయవంతంగా నడిపేందుకు విధి నిర్వహణలో ఇతరులకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఉత్తమ పనితీరు కనబర్చి తనకంటూ ప్రత్యేక స్థానం నిలుపుకున్నారన్నారు. ఆయన భవిష్యత్‌లో మరింత పేరు గడించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పాడి రైతుల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు దేవునూరి శ్రీశైలం, పాషా, రంజిత్ రెడ్డి, రంజిత్, విజయ డైరీ సిబ్బంది ప్రభాకర్, శ్రీను, యేసయ్య తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# విద్య జీవితాన్ని మార్చే ఆయుధం : జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : విద్య జీవితాన్ని మార్చే శక్తివంతమైన ఆయుధమని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఉన్న 16 ఎస్సీ వసతి గృహాలలో 10వ తరగతి చదువుతున్న 212 మంది విద్యార్థినీ-విద్యార్థులకు ఆదివారం కొత్తగూడెం క్లబ్‌లో ప్రేరణ, శిక్షణ తరగతులు నిర్వహించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించి, పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించి, భారత రాజ్యాంగ శిల్పి డా. బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, 10వ తరగతిలో సాధించే మార్కులే జీవిత విజయానికి కొలమానం కాదని స్పష్టం చేశారు. నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించి సమాజంలో గౌరవప్రదమైన స్థానం సంపాదించినప్పుడే నిజమైన విజయం దక్కుతుందని పేర్కొన్నారు. చదువుతో పాటు క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదల వంటి విలువలను అలవర్చుకోవాలని సూచించారు. ఎస్సీ విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, వార్డెన్ల సూచనలను పాటిస్తూ నిరంతర కృషితో లక్ష్య సాధనకు శ్రమించాలని అన్నారు. ఈ ప్రేరణ, శిక్షణ తరగతులు విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంచి, మెరుగైన విద్యా ఫలితాలు సాధించేందుకు దోహదపడతాయని తెలిపారు. అనంతరం సబ్జెక్టు నిపుణులు 10వ తరగతి పరీక్షలకు సంబంధించిన ముఖ్యమైన బోధన అంశాలపై శిక్షణ అందించారు. ప్రతి సబ్జెక్టులో కీలక అధ్యాయాలు, ప్రశ్నల రూపకల్పన, సమయ నిర్వహణ, పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించే విధానాలపై విస్తృతంగా వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ, పరీక్షలపై ఉన్న భయాన్ని తొలగించేలా మార్గదర్శనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి ఎ. శ్రీలత, సహాయ సంక్షేమ అధికారులు కొప్పుల హనుమంతరావు, సిహెచ్. అక్షయ్, వసతి గృహ సంక్షేమ అధికారులు, కార్యాలయ సిబ్బంది ఆర్.వి.ఆర్. ప్రసాద్, నరసింహారావు, సాయి చరణ్, నాగలక్ష్మి, బోధన సిబ్బంది తారాచంద్, మోహన్ రావు, దస్తగిరి, బి.వి.ఎల్. కుమార్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు tgobmms ద్వారా దరఖాస్తులు



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : జిల్లాలో డిగ్రీ లేదా తత్సమాన కోర్సులు, పీజీ, పీహెచ్‌డీ అభ్యసిస్తున్న దివ్యాంగ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు వంటి సహాయ ఉపకరణాల కోసం తెలంగాణ వికలాంగుల కోఆపరేటివ్ కార్పొరేషన్, హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లెనీనా తెలిపారు.అంధులు, బధిరులు , శారీరక దివ్యాంగ విద్యార్థులు http://tgobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 10వ తేదీ వరకు పొడిగించారని పేర్కొన్నారు. అర్హులైన దివ్యాంగ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.ఇతర వివరాలకు 6301981960, 8331006010 నంబర్లను సంప్రదించవచ్చని ఆమె తెలిపారు.

## బీఆర్ఎస్ లో చేరిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింతల సాయిలు కాంగ్రెస్ పార్టీకి షాకిచ్చారు. మాజీ మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. చింతల సాయిలు ఉమామహేశ్వరీ దంపతులకు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి గులాబీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చింతల సాయిలు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని గులాబీ గూటికి చేరానన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గిర్కాటి నిరంజన్ గౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి వెంకట్ రెడ్డి, తాడూరి పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చలమల్ల కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చలమల్ల కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు అభిమానుల ఆధ్వర్యంలో చౌటుప్పల్ మండలం దామెరలోని ఆయన కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు మండలంలోని శ్రీ ఆందోల్ మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దామెరలోని ఆయన కార్యాలయానికి చేరుకున్నారు. వివిధ మండలాల నుంచి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు చలమలకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేశారు. పలు గ్రామాల నుంచి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. పూల బొకేలను అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆయన అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఆశీర్వదించండి... అండగా వుంటాను

*** 18 వ డివిజన్ లో ప్రచారం లో ఆలకుంట్ల ఝాన్సీ నాగరత్నం రాజు ..**



ప్రజా స్ఫూర్తి నల్లగొండ : నల్గొండ పట్టణంలోని 18వ డివిజన్ లో ఆదివారం కార్పొరేటర్ అభ్యర్థి ఆలకుంట్ల ఝాన్సీ నాగరత్నం రాజు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. డివిజన్ లో కార్యకర్తలతో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వార్డులో కౌన్సిలర్ గా పనిచేసి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశానని, సిసి రోడ్ నిర్మాణం డ్రైనేజీ నిర్మాణం చేశానని, ఇంటింటికి నల్ల సౌకర్యం కల్పించానని చెప్పారు. కరోనా సమయంలో ప్రజలకు కూరగాయలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశానని చెప్పారు. ఈసారి గెలిపిస్తే తాను వార్డు ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడతానని ఎవరికి ఏ కష్టం వచ్చినా తాను ఆదుకుంటానని , డివిజన్ పరిధిలో అందుబాటులో ప్రజలకు ఉంటానని, డివిజన్ లో పెన్షన్ రాని వాళ్ళకి పెన్షన్లు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం కృషి చేస్తానని చెప్పారు. వృద్ధులకు పెన్షన్లు వార్డులో ఇచ్చే విధంగా అధికారులతో మాట్లాడి చర్యలు చేపడతామని అన్నారు. తనను డివిజన్ ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో 18 డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## లయన్స్ క్లబ్ అఫ్ సికింద్రాబాద్ నార్త్ 320 బి కి ఆదర్శవంతమైన క్లబ్

*** డిస్ట్రిక్ట్ గవర్నర్ సెల్వ సాయి రామ్ రాజ్**



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : లయన్స్ క్లబ్ అఫ్ సికింద్రాబాద్ నార్త్ 320 బి కి ఆదర్శవంతమైన క్లబ్ అని డిస్ట్రిక్ట్ గవర్నర్ సెల్వ సాయి రామ్ రాజ్ అభినందించారు. సికింద్రాబాద్ నార్త్ చాటర్ నైట్ కార్యక్రమం ఆదివారం జీడిమెట్లలోని ఓ ప్రైవేటు హోటల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిస్టిక్ గవర్నర్ సెల్వ సాయి రామ్ రాజ్ హజరై లయన్స్ క్లబ్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా ఉదయం అల్పాహారం అందిస్తూ అన్ని లయన్స్ క్లబ్బులకు ఆదర్శంగా నిలిచిందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టాలని ఆకాంక్షించారు. సికింద్రాబాద్ నార్త్ క్లబ్ ప్రపంచంలోనే ఎనిమిదవ అత్యంత పెద్ద క్లబ్ గ గుర్తింపు పొందిందన్నారు. ఈ కార్యక్రమంలో మల్టీ జోనల్ కౌన్సిల్ చైర్మన్ రాజేంద్ర ప్రసాద్, మాజీ గవర్నర్ లు విద్యాసాగర్, విజయ్ కుమార్ శెట్టి, లయన్స్ క్లబ్ సికింద్రాబాద్ నార్త్ అధ్యక్షులు బిర్రు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి జనార్దన్ దయాకర్, నాయకులు శైలజ నాయర్, చల్ల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అఖండ విజయం అందించాలి

*** రాష్ట్ర నాయకులు ఆళ్ల మురళి**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర నాయకులు ఆళ్ల మురళి సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు పిలుపునిచ్చారు. కొత్తగూడెం ఏరియా వి.కే.ఓ.సి జెట్టి మోహన్, బూరుగు సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. జిల్లాలో ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే స్పందిస్తూ పరిష్కారం చూపుతున్న రాష్ట్ర గౌరవ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి (శీనన్న) కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడిగా తనదైన ముద్ర వేస్తున్నారని అన్నారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు తరతరాలుగా గుర్తుండిపోయేలా ఉన్నాయని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి లభిస్తున్న అపూర్వ స్పందనతో ప్రతిపక్షాలకు నిద్రపట్టడం లేదని విమర్శించారు. ఎన్నికలు ఏవైనా ప్రజల తీర్పు కాంగ్రెస్‌కే అనుకూలంగా వస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లాలో పొంగులేటి శీనన్న పేర్లు చరిత్రలో నిలిచిపోతాయని తెలిపారు.ఈ ఎన్నికల్లో అన్ని సీట్లు గెలిచి శీనన్నకు కానుకగా అందిద్దామని కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో వాడపల్లి రమేష్, నాగేందర్, నవీన్, షరీఫ్, తిరుపతి, గంగారం, పోశం, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న బిజెపి వార్డు అధ్యక్షుడు



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ పరిధి తాళ్ళసింగారం గ్రామం బిజెపి 2వ వార్డు అధ్యక్షుడు మట్టపల్లి యాదగిరి, బిజెపి పార్టీ సీనియర్ నాయకులు సుర్వి నరేష్ గౌడ్ లు మాజీ ఎంపీపీ తాడూరి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారి కుటుంబ సభ్యులందరికీ కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గెలుపుకు నిరంతరం కృషి చేస్తామన్నారు. 2వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి సుర్వి మంజుల నరసింహ గౌడ్ ను గెలుపే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య, సుర్వి ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, దొనకొండ కృష్ణ, గుత్త శ్రీధర్ రెడ్డి, దొనకొండ నరసింహ, ఊదరి నరసింహ, కొసనం రాకేష్ రెడ్డి, బొంగు ప్రవీణ్ గౌడ్, సుర్వి మహేష్ గౌడ్, మట్టపల్లి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## 39వ డివిజన్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి అల్లి వేణు ఇంటింటి ప్రచారం..



ప్రజా స్ఫూర్తి నల్లగొండ : నల్గొండ కార్పొరేషన్ పరిధిలోని 39 వ డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి అల్లి వేణు ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లి వేణు మాట్లాడుతూ, అమలు కాని హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండున్నర సంవత్సరాలుగా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందని విమర్శించారు.మళ్లీ ఎన్నికల వేళ ప్రజలను మోసం చేయడానికి కాంగ్రెస్ నాయకులు వస్తున్నారని, వారి మాటలను నమ్మి మరోసారి మోసపోవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. అభివృద్ధి, సంక్షేమానికి బీఆర్ఎస్ పార్టీ మాత్రమే సరైన ప్రత్యామ్నాయమని పేర్కొంటూ, కార్పొరేషన్‌లో కారు గుర్తుపై ఓటు వేసి మరోసారి గులాబీ జెండా ఎగురవేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఈ ఇంటింటి ప్రచార కార్యక్రమంలో 39వ కార్పొరేట్ డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆర్థిక భవిష్యత్తుకు అంతర్జాతీయ దృష్టి

*** తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు డా. రేఖ బోయలపల్లి**

హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి :తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మక హార్వర్డ్ యూనివర్సిటీ లో నాయకత్వ-పరిపాలన శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసి, అమెరికా పర్యటన ముగించుకుని రాష్ట్రానికి తిరిగి రావడం తెలంగాణకు గర్వకారణమని తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు డా. రేఖ బోయలపల్లి అన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా ఆధునిక పరిపాలన విధానాలు, ఆర్థిక రూపాంతరం, ప్రజా ఆర్థిక వ్యవస్థ, మౌలిక వసతుల నిధుల సమీకరణ, ఉపాధి ఆధారిత అభివృద్ధి వంటి అంశాల్లో ముఖ్యమంత్రికి అంతర్జాతీయ స్థాయి అవగాహన లభించిందని ఆమె తెలిపారు.అమెరికా పర్యటన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గ్లోబల్ పెట్టుబడిదారులు, ఐటీ-టెక్నాలజీ సంస్థలు, వెంచర్ క్యాపిటల్ ఫండ్లు, ప్రవాస తెలంగాణ పారిశ్రామికవేత్తలతో విస్తృత స్థాయి చర్చలు జరిపారని డా. రేఖ వెల్లడించారు. ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, లైఫ్ సైన్సెస్, గ్రీన్ ఎనర్జీ, స్టార్టప్ రంగాల్లో తెలంగాణలో పెట్టుబడులపై సానుకూల స్పందన వ్యక్తమైందని ఆమె పేర్కొన్నారు.ఈ పర్యటన ఫలితంగా తెలంగాణకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెరగడమే కాకుండా, యువతకు ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం రాష్ట్రానికి అందుబాటులోకి రానున్నాయని అన్నారు.ప్రాంతీయ అవసరాలను అర్థం చేసుకుంటూనే, అంతర్జాతీయ ప్రమాణాలతో రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాలన్న దృక్పథాన్ని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టంగా చూపించారు. ఇది రాజకీయ పర్యటన కాదు--- తెలంగాణ ఆర్థిక భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే," అని ఆమె స్పష్టం చేశారు.ముఖ్యమంత్రిగా ప్రజల నుంచి వచ్చిన విశ్వాసాన్ని, అంతర్జాతీయ అనుభవంతో కలిపి తెలంగాణను అభివృద్ధి పథంలో మరింత వేగంగా నడిపించే నాయకత్వం సీఎం రేవంత్ రెడ్డి దని తెలిపారు



# రాజకీయ కుట్రలో భాగమే కేసీఆర్ కు నోటీసులు

* **బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టిన వ్యక్తి కేసీఆర్...**
* **మాజీ సర్పంచ్ మాణిక్ రెడ్డి, పార్టీ అధ్యక్షుడు గజేందర్ రెడ్డి..**

అందోలు, ప్రజాస్ఫూర్తి: ఫోన్ ట్యాపింగ్ కేసులో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిట్ నోటీసులు పంపటం రాజకీయ కక్ష సాధింపుల్లో భాగమేనని మాజీ సర్పంచ్ శేరి మాణిక్ రెడ్డి, బిఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు బగిలి గజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపుమేరకు నిరసన కార్యక్రమంలో భాగంగా అందోలు మండల పరిధిలోని కన్ సాన్ పల్లి గ్రామంలో బైకు ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెసిఆర్ కు ఎందుకు నోటీసులు ఇచ్చారో చెప్పాలన్నారు. రైతుబంధు ఇచ్చినందుకు కేసీఆర్ కు సిట్ నోటీసులు ఇచ్చారా? కాళేశ్వరం లాంటి ప్రాజెక్టు కట్టినందుకు కేసీఆర్ కు నోటీసులు ఇచ్చారా? ఎందుకు కేసిఆర్ కు నోటీసులు ఇచ్చారా ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రెండేళ్లలో కాంగ్రెస్ పాలన అవినీతికి భయం అయిందని.. ఏ రంగం చూసిన అన్ని స్కాంలే బయటపడుతున్నాయని ఆరోపించారు. అవన్నీ బయటపడుతుంటే డైవర్ట్ చేసేందుకు బీఆర్ఎస్ నాయకులను వేధిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ బిఆర్ఎస్ ప్రభుత్వ 10 ఏళ్ల దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టిన వ్యక్తి కేసీఆర్ అని కొనియాడారు.కేసీఆర్ కు సీటు నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిలుకంటి వెంకటేశం, సీనియర్ నాయకులు బి. సంగమేశ్వర్, దేవునూరి కృష్ణ, ధీరజ్ రెడ్డి, వార్డు సభ్యులు శివచందర్, నాయకులు వినోద్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి, రామన్న గారి నాగేష్, కాల్వమీది ప్రభు, దేవునూరి పోచయ్య, దేవనూరి కిషన్, చింతకుంట రాజు, ఆసిఫ్, కర్రే శ్రీశైలం, బుస నెల్లి శంకరయ్య, చింతకుంట దత్తు తదితరులు పాల్గొన్నారు.

## సిట్ విచారణ పేరుతో నోటీసులు ఇవ్వడం తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరచడమే



పీర్జాదిగూడ , (ప్రజాస్ఫూర్తి) : తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా భావించే కేసీఆర్ గారిపై లేనిపోని ఆరోపణలు మోపుతూ, సిట్ విచారణ పేరుతో నోటీసులు ఇవ్వడం తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరచడమేనని ఖండిస్తూ పీర్జాదిగూడ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారాన్ని అడ్డంపెట్టుకుని ఫోన్ ట్యాపింగ్ కేసు పేరుతో తప్పనిసరిగా విచారణకు హాజరుకావాలని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) కు సిట్ నోటీసులు జారీ చేయడాన్ని ఖండిస్తూ పీర్జాదిగూడ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, దొంతిరి హరిశంకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు నల్ల కండువాలు ధరించి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రాస్తారోఖో నిర్వహించి ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...మహాత్మా గాంధీ చేసిన భారత స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో మా నాయకుడు కేసీఆర్ నాయకత్వంలో సుమారు 14 సంవత్సరాల పాటు నిరంతర ఉద్యమం చేసి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు. సుదీర్ఘ పోరాటంతో సాధించిన తెలంగాణను పదేళ్ల పాటు సుభిక్షంగా, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలించారు" అని గుర్తుచేశారు. కేసీఆర్ తెచ్చిన తెలంగాణలో ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో దిగజారుతోందని ఆరోపించారు. ఇది పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వ అహంకార పాలనకు నిదర్శనమని, ప్రభుత్వానికి , రాష్ట్ర ముఖ్యమంత్రికి ప్రజల పట్ల, తెలంగాణ భావోద్వేగాల పట్ల ఏమాత్రం అవగాహన లేకపోవడమే దీనికి కారణమని అన్నారు.ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు నిర్మల, యూత్ అధ్యక్షులు ప్రభు, ఆంజనేయులు, బాలరాజు, కోనేటి వెంకట్, పింగలి జోగిరెడ్డి, వరికల శ్రీనివాస్, యాసారం శ్రీనివాస్, మునికుంట్ల కిరణ్ గౌడ్, శ్యామల శ్రీనివాస్, ప్రవీణ్ రెడ్డి, సతీష్ గౌడ్, తిరుపతి రెడ్డి, విజయ్, రమేష్, మధు, శ్రీను, పాశం నరేందర్ రెడ్డి, రామకృష్ణ, శంకర్ చారి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్‌పై పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి పెద్ద ఊతం కల్పించబడిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రకటించారు. కేంద్రం ప్రవేశపెట్టిన రూ.53.47 లక్షల కోట్ల బడ్జెట్‌లో రక్షణ, వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, రవాణా, విద్య, వైద్యం, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాలకు ప్రాధాన్యత కేటాయించడం దేశ ఆర్థిక శక్తిని పెంపొందించడంలో కీలకంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం 2047 నాటికి భారత్‌ను ప్రపంచ ఆర్థిక శక్తిగా నిలిపే సంకల్పంతో ముందుకు సాగుతోందన్నారు. వరుసగా 9వ బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కి ప్రత్యేక అభినందనలు తెలిపారు. రక్షణ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిన ఈ బడ్జెట్‌లో రూ.7.84 లక్షల కోట్లను కేటాయించడం ద్వారా దేశ భద్రతపై కేంద్ర ప్రభుత్వం తీసుకునే ప్రాధాన్యతను వెల్లడించిందని పవన్ కళ్యాణ్ తెలిపారు.

**అంతర్గత భద్రతకూ**

అంతర్గత భద్రతకూ రూ.2.55 లక్షల కోట్ల కేటాయింపు జరిగిందని పవన్ పేర్కొన్నారు. రవాణా రంగానికి ప్రోత్సాహం ఇచ్చే విధంగా హైస్పీడ్ కారిడార్లు, ఎస్ఎంఈ గ్రోత్ ఫండ్, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, పట్టణాల్లో కార్పొరేట్ మిత్రులు వంటి కార్యక్రమాలు ఆంధ్రప్రదేశ్ ప్రగతికి దోహదం చేస్తాయని ఆయన తెలిపారు. వ్యవసాయ రంగానికి రూ.1.40 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించడం ద్వారా రైతు సాధికారతకు మద్దతు దిద్దినట్టు కూడా ఆయన తెలిపారు. గ్రీన్ ఎనర్జీ, విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి, పర్యాటక రంగాలకు ఇచ్చిన ప్రోత్సాహకాలు రాష్ట్రానికి, ప్రజలకు ఉపయోగకరమని పవన్ కళ్యాణ్ అన్నారు. ముఖ్యంగా 17 రకాల క్యాన్సర్ ఔషధాలు, డయాబెటిక్ మందులపై పన్ను తగ్గింపు అనేక మందికి ఊరట కలిగిస్తుందని ఆయన వివరించారు. డేటా సెంటర్ల స్థాపనకు 2047 వరకు టాక్స్ హాలిడే ఇచ్చిన కేంద్ర నిర్ణయం, రాష్ట్రంలో విశాఖ, ఇతర ప్రాంతాల్లో డేటా సెంటర్ల ఏర్పాటు కోసం మంచి పరిసరాలను సృష్టిస్తుందని ఆయన పేర్కొన్నారు.




## ఘనంగా లయన్ విష్ణువర్థన్ రెడ్డి జన్మదిన వేడుకలు

జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : ఏఆర్కే ఫ్యాబ్ టెక్ అదినేత లయన్ విష్ణువర్ధన్ రెడ్డి 43 జన్మదిన వేడుకలను ఆదివారం లయన్ క్లబ్ ఆర్యా ఆధ్వర్యంలో నగరంలోని ఎర్రగడ్డ సమీపంలోని ఈ.ఎస్.ఐ.ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డి.ఎస్.పి నాగేశ్వర్ రావు,శ్రీ రాజలక్ష్మి ఇండస్ట్రీస్ అదినేత,లయన్ క్లబ్ ఆఫ్ ఆర్య గాంధినగర్ వ్యవస్థాపకులు,సాహిత్య కళా పోషకులు లయన్ డాక్టర్. చిల్లా రాజశేఖర్ రెడ్డి లు హజరై రోగులకు పండ్లు పంపిణీ చేసిన అనంతరం బంధుమిత్రుల సమక్షంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ పెద్ద మనసుతో నిరుపేదల కడుపు నింపుతూ సమాజసేవలో తనవంతు కృషి చేస్తున్న విష్ణువర్థన్ రెడ్డి ని అభినందిస్తూ శాలువా తో సన్మానించి,లయన్స్ సేవలో మీ జీవితం కొనసాగాలని నిండునూరేళ్లు వర్ధిల్లాలని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.విష్ణువర్థన్ రెడ్డి మాట్లాడుతూ గురుస్వామీ రాజశేఖర్ రెడ్డి సమక్షంలో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అమ్మానాన్నలాంటి పెద్దలకు నాచేతితో వడ్డించి అన్నదానం చేయటం గొప్ప అదృష్టంగా బావిస్తున్నాని సంతోషం వ్యక్తపరిచారు.ఈ సందర్భముగా అభినవ కవి,మానస టూల్ టెక్ అధినేత వాకిటి రామ్ రెడ్డి మాట్లాడుతూ జీవితంలొ ఎన్నో అనుబావాలను నేర్చుకుంటూ,స్వయం కృషితో జీవిస్తూ, యువతరానికి స్ఫూర్తిగా నిలిచిన విష్ణువర్ధన్ రెడ్డిని నిండు మనసుతో దీవించి తాను లిఖించిన కవిత ను మధురంగా పాటగా పాడి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో లయన్ క్లబ్ ప్రతినిధులు పెద్దలు ఆదిరెడ్డి,రాజేంద్ర ప్రసాద్,అడ్వకేట్ రఘవేందర్ రావు,రాఘవ రెడ్డి,ఎల్లా సుబ్బారెడ్డి,రమణా రెడ్డి, హేమాద్రి నాయుడు,రంజిత్ కుమార్,జింకల వెంకటేశ్,బి.వి.సూర్యనారాయణ,సఫి,కుటుంబ సభ్యులు పాల్గొన్నారు



## కేసీఆర్ పై ఈగ వాలినా.. ఊరుకోం

- **ప్రభుత్వానికి వ్యతిరేకంగా జాతీయ రహదారిపై నిరసన ర్యాలీ**
- **మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మాజీ సీఎం కేసీఆర్ పై ఈగ వాలినా తెలంగాణ ప్రజలు ఊరుకోబోరని.. తగిన బుద్ధి చెప్తారని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు ఫోన్ ట్యాపింగ్ కేసులో నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ చౌటుప్పల్ మండల కేంద్రంలో ఆదివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు నల్ల జెండాలతో బస్టాండ్ నుంచి జాతీయ రహదారి వెంట వలిగొండ రోడ్డు నుంచి బస్టాండ్ ఆవరణ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్కు నోటీసులు ఇవ్వడం అంటే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన కెసిఆర్ ను విచారణ పేరుతో నోటీసులు జారీ చేసి, కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు తెరలేపిందని ఆరోపించారు. ప్రస్తుతం జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలను పక్కదారి పట్టించేందుకే ఒక్కొక్కరికి నోటీసులు జారీ చేస్తుందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు, నోటీసులతో బీఆర్ఎస్ నాయకులను భయపెట్టేందుకు పూనుకుందని ఆరోపించారు. ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పడానికి సిద్ధపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, బీఆర్ఎస్ మండలం పార్టీ అధ్యక్షుడు గిర్కాటి నిరంజన్ గౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి వెంకట్ రెడ్డి, నాయకులు తాడూరి పరమేష్, ముప్పిడి శ్రీనివాస్ గౌడ్, ఊడుగు మల్లేశం, కొత్త పర్వతాలు యాదవ్, ముటుకుల్లోజు దయాకరాచారి, చిన్నం బాలరాజు, తొర్పునూరి మల్లేశం, వలందాస్ సతీష్ తదితరులు పాల్గొన్నారు

## 22వేల కోట్లు వస్తాయనుకుంటే.. 4వేల కోట్లే వచ్చాయి

* **రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా బడ్జెట్**
* **రాష్ట్రాల ఆర్థిక స్వావలంబన లేనిదే దేశాభివృద్ధి సాధ్యమా..?**
* **తెలంగాణపై కేంద్ర ప్రభుత్వానిది వివక్షాపూరిత సమాఖ్య ధోరణి**
* **రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**




హైదరాబాద్ : "భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 1 ప్రకారం.. ఇండియా అంటే రాష్ట్రాల సమూహం. రాష్ట్రాల ఆర్థిక స్వావలంబన లేనిదే దేశాభివృద్ధి సాధ్యపడదని రాజ్యాంగం చెబితే, కేంద్రం మాత్రం ఈ బడ్జెట్ లో ఆ మూలసూత్రాన్నే విస్మరించింది" అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విమర్శించారు. దేశ జీడీపీలో 5 శాతానికి పైగా వాటాను కలిగి ఉన్న తెలంగాణ గురించి బడ్జెట్ ప్రసంగంలో ఒక్కసారి కూడా ప్రస్తావించకపోవడం గర్హనీయమని ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రం తరచూ వల్లించే "సబ్ కా సాథ్ సబ్ కా వికాస్" అనే నినాదం "తెలంగాణ" విషయంలో కేవలం నీటి మూటలేనని మరోసారి ఈ బడ్జెట్ లో స్పష్టం అయ్యిందన్నారు. ఓ వైపు అభివృద్ధిలో అందరి భాగస్వామ్యం ఉంటుందని చెబుతూనే, మరోవైపు నిధుల కేటాయింపుల్లో "తెలంగాణ" పట్ల రాజకీయ వివక్ష చూపడం రాజ్యాంగ నైతికత అనిపించుకోదని హితవు పలికారు. "బడ్జెట్ అనేది ఆర్థిక హేతుబద్ధత ఆధారంగా రూపొందించాలి. కానీ... కేంద్రం రాజకీయ అనుకూలత కు ప్రాధాన్యతనిచ్చి తాజా బడ్జెట్లో తెలంగాణ వంటి ప్రగతిశీల రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసింది" అని వివరించారు.

**10 నెలలు గడుస్తున్నా ఇచ్చింది 4వేల కోట్లే**

"ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుంచి గ్రాంట్ల రూపంలో తెలంగాణకు రూ. 22,782 కోట్లు వస్తాయని అంచనా వేయగా, ఆర్థిక సంవత్సరం ప్రారంభమై 10 నెలలు గడుస్తున్నా అందింది కేవలం సుమారు రూ. 4,000 కోట్లు మాత్రమే. అంటే రావాల్సిన దాంట్లో 20 శాతం కూడా అందలేదు. ఇది తెలంగాణ పట్ల కేంద్రం చూపుతున్న ఆర్థిక అణచివేత కు ఇది మరో సాక్ష్యం" అని వెల్లడించారు. "రాజ్యాంగం ప్రకారం కేంద్ర, రాష్ట్రాల మధ్య వనరుల పంపిణీ అనేది సమ న్యాయంగా జరగాలి. కానీ, సహకార సమాఖ్య సూత్రాలకు విరుద్ధంగా "తెలంగాణ" పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్షాపూరిత సమాఖ్య ధోరణిని ప్రదర్శిస్తోందని తాజా బడ్జెట్ మరోసారి రుజువు చేసింది" అని అన్నారు. "రీజనల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్లు, మెట్రో ఫేజ్ - 2, గోదావరి - మూసీ అనుసంధానం, బందరు పోర్టు హైదరాబాద్ డ్రైపోర్టు మధ్య గ్రీన్ ఫీల్డ్ హైవే, నాలుగు కొత్త విమానాశ్రయాలు, రైలు కనెక్టివిటీ మెరుగుదల, విభజన చట్టంలోని పెండింగ్ హామీల అమలుకు నిధులు కేటాయించాలని మేము పలుమార్లు కోరినా పట్టించుకోకపోవడం ప్రతిపక్షాల పాలిత రాష్ట్రాల పట్ల కేంద్ర ప్రభుత్వం అవలభిస్తోన్న వివక్ష పూరిత వైఖరికి నిలువెత్తు నిదర్శనం" అని ఆందోళన వ్యక్తం చేశారు. "హై స్పీడ్ రైల్ కారిడార్స్"తో "తెలంగాణ"కు మమ అనిపించిన కేంద్ర ప్రభుత్వ వివక్షపూరిత వైఖరిపై తెలంగాణ నుంచి బీజేపీ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న 8 మంది ఎంపీలు ఈ రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి శ్రీధర్ బాబు డిమాండ్ చేశారు. ఇకనైనా కేంద్రం తన ధోరణిని వీడి, రాజ్యాంగబద్ధమైన సమానత్వం పాటించాలని కోరారు.

## కేంద్ర బడ్జెట్ తెలంగాణకు గర్వకారణం
## : బీజేపీ స్టేట్ చీఫ్ రాంచందర్ రావు కీలక వ్యాఖ్యలు

పార్లమెంట్ లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ 'వికసిత్ భారత్' నిర్మాణ సంకల్పం ఇక ఆశయంగా మాత్రమే కాకుండా, వాస్తవంగా మారే దిశగా దేశాన్ని దృఢంగా ముందుకు నడిపిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఈ బడ్జెట్ గర్వకారణమని, హైదరాబాద్‌కు హైస్పీడ్ రైల్ కారిడార్ల ప్రకటనతో రాష్ట్రం జాతీయ వృద్ధి యంత్రంగా మరింత బలపడనుందని అన్నారు. ఇది మార్పును తీసుకొచ్చే బడ్జెట్ అని, ఆర్థిక బలం నుంచి జాతీయ సామర్థ్యానికి, అంత్యోదయం నుంచి అభ్యుదయానికి దేశాన్ని నడిపించే స్వర్ణ యాత్రకు పునాది వేస్తోందని చెప్పారు. పచ్చని పొలాలు, బలమైన ధాన్యాగారాలు, ప్రతి కుటుంబంలో చిరునవ్వులు ఉండేలా ఉందన్నారు. ఆత్మనిర్భర్ భారత్ దృష్టితో రూపొందిన ఈ బడ్జెట్ దేశీయ తయారీ రంగానికి ఊతమివ్వడంతో పాటు, ఇంధన భద్రతను బలోపేతం చేస్తోందని, దిగుమతులపై ఆధారాన్ని తగ్గించే దిశగా కీలక సంస్కరణలను తీసుకొస్తోందన్నారు. ఉపాధి సృష్టి, వ్యవసాయ ఉత్పాదకత పెంపు, కొనుగోలు శక్తి వృద్ధి, నాణ్యమైన విద్యవైద్య సేవల విస్తరణకు ఈ బడ్జెట్



బలమైన పునాదిని వేస్తోందన్నారు. ఈ నిరంతర విధానాల

# రాష్ట్ర ప్రభుత్వం ఆడించినట్టుగా సిట్ ఆడుతోంది: కేటీఆర్



హైదరాబాద్: వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడమే కాంగ్రెస్ పాలన అని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ సిట్ విచారణ ముగిసిన తర్వాత నందినగర్‌లోని నివాసంలో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ''రెండేళ్ల కాంగ్రెస్ పాలన గురించి మూడు ముక్కల్లో చెప్పాలంటే.. డైవర్షన్, సబ్ వెర్షన్, పర్ వర్షన్. ఇది ఈ రాష్ట్రంలో రెండేళ్లుగా జరుగుతున్న కాంగ్రెస్ పాలన తీరు. 8 + 8 గుండుసున్నా అన్నట్టుగా రాష్ట్ర పరిస్థితి ఉంది. కాంగ్రెస్, భాజపా అసమర్థత వల్ల రాష్ట్రానికి అన్యాయం జరుగుతోంది. కేంద్ర బడ్జెట్‌లో గత రెండు సార్లు దక్కింది సున్నా, ఈ సారి కూడా రాష్ట్రానికి గుండుసున్నా అని తెలుసు కాబట్టే ఆగమేఘాల మీద విచారణ తెరపైకి తెచ్చారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగితే ఒక్కరూ స్పందించలేదు. ప్రజల్లో అపోహలు, అసత్యాలు సృష్టించేందుకే సిట్ విచారణ పేరుతో నాటకాలు సిట్ అధికారులు చట్టాన్ని గౌరవించలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఆడించినట్టుగా సిట్ ఆడుతోంది. చట్ట ప్రకారం కేసీఆర్ ఉన్న చోటే విచారణ జరగాల్సి ఉంది. మేం కోర్టుకు వెళ్తే మాకు అనుకూలంగా తీర్పు వచ్చే అవకాశం ఉంది. అయినా, చట్టాన్ని గౌరవిస్తూ కేసీఆర్.. సిట్ విచారణకు హాజరయ్యారు. రాష్ట్రంలో దిగజారిన శాంతిభద్రతల గురించి పట్టించుకునేవారే లేరు. ఎక్సైజ్ కానిస్టేబుల్‌ను గంజాయి ముఠా చంపితే కూడా పట్టించుకునేవారు లేరు. మేడారం జాతరలో పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయని ప్రజలు అంటున్నారు. సిట్ విచారణల పేరుతో కాలక్షేపం చేయడమే కాంగ్రెస్ ఉద్దేశం. దిల్లీకి 50..60 ట్రిప్పులు కొట్టారు గానీ, సాధించిందేమీ లేదు. ఇకనైనా డైవర్షన్ రాజకీయాలు మానుకొని అభివృద్ధిపై దృష్టి సారించాలి'' అని కేటీఆర్ అన్నారు.



## ఖమ్మంలో భారాస ఆందోళన ఉద్రిక్తం

**: సీఐ చేతికి ఫ్రాక్చర్**

ఖమ్మం కార్పొరేషన్: ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు సిట్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ భారాస ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలో ఆదివారం చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి బైపాస్ రోడ్డు, బస్‌డిపో రోడ్ మీదుగా ఇల్లెందు క్రాస్‌రోడ్డు వరకు ప్రదర్శన చేపట్టారు. అక్కడ కొద్దిసేపు రాస్తారోకో చేశారు. అనంతరం ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసేందుకు యత్నిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులకు, భారాస నాయకుల మధ్య తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో నేతలు జోక్యం చేసుకొని ఆపేందుకు ప్రయత్నించినప్పటికి కొద్దిసేపు తోపులాట కొనసాగింది. ఈ క్రమంలో దిష్టిబొమ్మపై పెట్రోలు పోసి నిప్పుపెట్టేందుకు కార్యకర్తలు యత్నించగా సీఐ కరుణాకర్ అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ పెనుగులాటలో సీఐ చేతికి ఫ్రాక్చర్ కావడంతో వెంటనే ఆయన్ను ఆసుపత్రికి తరలించారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు..
## నాలుగున్నర గంటల పాటు కేసీఆర్‌ను ప్రశ్నించిన సిట్






హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో భారత రాష్ట్ర సమితి అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సిట్ విచారణ ముగిసింది. హైదరాబాద్ నందినగర్‌లోని ఆయన నివాసంలో నాలుగున్నర గంటలకు పైగా సిట్ అధికారులు ప్రశ్నించారు. కేసీఆర్ విచారణను సిట్ అధికారులు ఆడియో, వీడియో రికార్డు చేశారు. విచారణ అనంతరం నందినగర్ నుంచి సిట్ అధికారులు వెళ్లిపోయారు. నందినగర్‌లోని కేసీఆర్ ఇంటి వద్దకు బీఆర్ఎస్ నేతలు భారీగా చేరుకున్నారు. బాల్కనీలో నిలబడి పార్టీ శ్రేణులకు కేసీఆర్ అభివాదం చేశారు. అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. మున్సిపల్ ఎన్నికల గురించి ప్రస్తావించారు. పార్టీ క్షేత్రస్థాయిలో చాలా బలంగా ఉందన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో కేసీఆర్ సమావేశమయ్యారు. అనంతరం నందినగర్ నుంచి ఎర్రవల్లికి బయల్దేరారు.

**సిట్ విచారణపై స్పందించిన కేటీఆర్**

కేసీఆర్ సిట్ విచారణపై భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. దిల్లీ ఒత్తిళ్లకు తలొగ్గని వ్యక్తిగా కేసీఆర్‌ను అభివర్ణించారు. తెలంగాణ కోసం సాగిన సుదీర్ఘ పోరాటంలో సెకను కూడా పక్కకు తప్పుకోని ధీశాలి అన్నారు. ఈ రాష్ట్రం కోసం ఎన్ని కష్టాలు ఎదురైనా వెనకడుగు వేయని వ్యక్తిగా పేర్కొన్నారు. దుష్టశక్తులకు వ్యతిరేకంగా పర్వతంలా నిలబడిన మనిషి కేసీఆర్ అన్నారు. చిల్లర రాజకీయాలకు, నీచమైన ఎత్తుగడలకు వణికిపోయే వ్యక్తి కాదని.. కేసీఆర్ అజేయుడని ప్రభుత్వాన్ని ఉద్దేశించి పేర్కొన్నారు. మూర్ఖులు చరిత్రను సృష్టించడం పక్కన పెడితే.. కనీసం చరిత్రను అర్థం కూడా చేసుకోలేరని ఎద్దేవా చేశారు. ఆయన పేరు వింటేనే మీకు వణుకు పుడుతుందన్నారు. ఆయన పేరు ఎత్తే స్థాయి కూడా మీకు లేదని కాంగ్రెస్ నేతలనుద్దేశించి వ్యాఖ్యానించారు. ఎంత విషం చిమ్మినా.. ఆయనను ఎవరూ ఏమీ చేయలేరన్నారు. కేసీఆర్ అంటే తెలంగాణ చరిత్ర.. ఆ చరిత్రలో మీరు కనీసం ఒక చిన్న ఫుట్ నోట్ కూడా కాలేరని దుయ్యబట్టారు.

## బీఆర్ఎస్ నేతలను అడ్డుకున్న పోలీసులు..
## తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత



హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి రాష్ట్ర కార్యాలయం తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. తెలంగాణ భవన్ నుంచి ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శంబీపూర్ రాజుతోపాటు ఇతర నేతలు ప్రయత్నించారు. ఆ నేతలంతా బయటకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు బీఆర్ఎస్ నేతల మధ్య తోపులాట చోటుచేసుకోవడంతో కాసేపు ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ఎస్ నేతలు శాంతియుతంగా నిరసన చేస్తుంటే పోలీసులు అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని శంబీపూర్ రాజు మండిపడ్డారు. ప్రభుత్వం, పోలీసులు ఇలాగే వ్యవహరిస్తే తాము మరింత దూకుడుగా వెళ్లాల్సి ఉంటుందన్నారు.

## బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం.. ఎంపీలంతా కేంద్రంపై ఒత్తిడి పెంచాలి



హైదరాబాద్: కేంద్ర బడ్జెట్ తెలంగాణను నిరాశకు గురి చేసిందని ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఈసారి బడ్జెట్‌లో ఆశించిన మేరకు కేటాయింపులు ఉంటాయని భావించినా.. ఈ ఏడాది కూడా అదే జరిగిందని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డితో సహా మంత్రులంతా.. ఎంపీల బృందంతో ప్రధానిని, కేంద్ర మంత్రులను అనేక సార్లు కలిశామని అయినా ప్రయోజనం లేదని విమర్శించారు. మూసీ, రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణలకు బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయని ఆశించామన్నారు. బయోఫార్మాపై ఫోకస్ చేశారని.. దాంట్లో కూడా తెలంగాణను గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసీఐఎల్ లాంటి కంపెనీని హైదరాబాద్‌లో పెట్టింది నాటి కాంగ్రెస్ ప్రభుత్వమేనన్న భట్టి.. కెమికల్ పార్క్‌లో కూడా హైదరాబాద్‌కు చోటు దక్కలేదని విమర్శించారు. ఆరెంజ్ ఎకానమీలో హైదరాబాద్ కేంద్రం... దానిని కూడా ముంబయికి తరలించారని, తెలంగాణ రాష్ట్రం ఏం తప్పు చేసిందని భట్టి ప్రశ్నించారు. రీజినల్ మెడికల్ హబ్ అని మెన్షన్ చేసినా... అందులో కూడా తెలంగాణ లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మూసీ ప్రక్షాళన కోసం ప్రధాని, కేంద్ర మంత్రులను కలిసినా సాయం అందలేదన్నారు. రామప్ప దేవాలయాన్ని యునెస్కో గుర్తించినా... టూరిజం విషయంలో కూడా రాష్ట్రానికి నిధులు కేటాయింపు జరగలేదన్నారు. సమ్మక్క, సారలమ్మ దర్శనానికి న్యూజిలాండ్ ట్రైబ్స్ కూడా వచ్చారని.. కానీ, కేంద్రం చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. బడ్జెట్‌లో జరిగిన అన్యాయంపై రాజకీయాలకు అతీతంగా.. రాష్ట్రంలోని ఎంపీలు అందరూ కలిసి కేంద్రంపై ఒత్తిడి పెంచాలని పేర్కొన్నారు.



## ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య కుటుంబానికి
## రూ.కోటి ఆర్థిక సాయం

హైదరాబాద్: ఎక్సైజ్ కానిస్టేబుల్ గాజుల సౌమ్య (25) కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించింది. రూ.కోటి నగదు, ఆమె కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వనున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. విధి నిర్వహణలో సౌమ్య ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని.. ఆమె కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. ఎక్సైజ్ విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు ఆయుధాలు సమకూర్చుతామని చెప్పారు. నిజామాబాద్‌లో జనవరి 23న అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముఠాను పట్టుకునేందుకు ప్రాణాల్ని సైతం లెక్కచేయకుండా సౌమ్య ప్రయత్నించారు. ఈ క్రమంలో అక్రమ రవాణాదారులు ఆమెను వాహనంతో ఢీకొట్టారు. ఈ క్రమంలో తీవ్రగాయాలు కావడంతో హైదరాబాద్ నిమ్స్‌లో సౌమ్యకు చికిత్స అందించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె శనివారం రాత్రి మృతిచెందారు.

## తెలంగాణకు 3 హైస్పీడ్ రైళ్లు..
## మెట్రో గురించి ప్రత్యేకంగా ఉండదు: కిషన్ రెడ్డి



దిల్లీ: దేశ ఆర్థిక వ్యవస్థను స్థిరంగా ముందుకు తీసుకెళ్లేలా బడ్జెట్ రూపకల్పన చేశారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. కేంద్ర బడ్జెట్‌పై ఆయన దిల్లీలో విలేకర్లతో మాట్లాడారు. రైతులకు అండగా నిలిచేందుకు ఎరువుల రాయితీని కేంద్ర ప్రభుత్వం పెంచిందని చెప్పారు. ఎరువులపై రాయితీ వల్ల తెలంగాణ రైతులు కూడా లబ్ధి పొందుతారని పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్ గతేడాది కంటే ఈసారి పెరిగిందన్నారు. కాకతీయ టెక్స్‌టైల్ పార్క్‌కు లబ్ధి కలిగే పథకాన్ని కేంద్రం తీసుకొచ్చిందని తెలిపారు. ''ప్రతి జిల్లాలో ఒక్కో బాలికల హాస్టల్‌ను కేంద్రం ఏర్పాటు చేయనుంది. తెలంగాణలోని 33 జిల్లాలకు బాలికల హాస్టళ్లు మంజూరు అవుతాయి. డేటా సెంటర్లకు ఉపయోగపడే నిర్ణయాన్ని మోదీ సర్కారు తీసుకుంది. డేటా సెంటర్లకు ఇచ్చే ప్రోత్సాహం వల్ల తెలంగాణకూ లాభం. విదేశీ విద్య కోసం వెళ్లే విద్యార్థులపై ఉండే పన్నును 5 శాతం నుంచి 2 శాతానికి తగ్గించారు. విదేశీ విద్యపై పన్ను తగ్గించటం వల్ల తెలుగు విద్యార్థులకు ఎంతో మేలు. రైల్వే బడ్జెట్‌ను రూ. 2.77 లక్షల కోట్లకు పెంచింది. రాష్ట్రానికి మూడు హైస్పీడ్ రైళ్లు రానున్నాయి. మెట్రో రైలు గురించి ప్రత్యేకంగా బడ్జెట్‌లో ఉండదు. మెట్రోపై డీపీఆర్ ఇస్తే.. పట్టణాభివృద్ధి శాఖ నిధులు ఇస్తుంది. మెట్రో రైలు ప్రాజెక్టుకు మంత్రివర్గ ఆమోదంతో నిధులు వస్తాయి. ప్రస్తుత మెట్రో ప్రాజెక్టు టేకోవర్ ప్రక్రియ పూర్తి చేసి డీపీఆర్ ఇస్తే కేంద్రం ఆమోదిస్తుంది. దేశంలో ఉపాధి అవకాశాలు పెంచేలా మోదీ సర్కారు చర్యలు చేపట్టింది'' అని కిషన్ రెడ్డి వెల్లడించారు.

**అదో టీవీ సీరియల్‌గా..**

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎం కేసీఆర్‌ను సిట్ అధికారులు విచారిస్తోన్న సంగతి తెలిసిందే. దానిపై మీడియా అడిగిన ప్రశ్నకు కిషన్ రెడ్డి స్పందించారు. ''ఫోన్ ట్యాపింగ్ కేసు టీవీ సీరియల్ మాదిరిగా కొనసాగుతోంది. ఇప్పటికే రెండేళ్లయ్యింది. ఇంకా ఎన్నాళ్లు సాగుతుందో తెలియదు. ఫోన్ ట్యాపింగ్ నిజమని స్వయంగా కేసీఆర్ కుమార్తె చెప్పారు. ఇంటి అల్లుడి ఫోన్ ట్యాప్ చేశారని స్వయంగా కవిత చెప్పారు. సాక్షాత్తు హైకోర్టు జడ్జిల ఫోన్లు ట్యాపింగ్ జరిగిందని అఫిడవిట్ వేశారు. నేతలు, వ్యాపారులు, సినీ నటుల ఫోన్లు ట్యాపింగ్ జరిగిందని అందులో పేర్కొన్నారు'' అని కిషన్ రెడ్డి తెలిపారు.

## కేంద్ర బడ్జెట్ సామాన్యుడికి ఊరట : కిమ్స్ సీఎండీ డా. బొల్లినేని భాస్కర్ రావు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సమగ్ర వృద్ధికి, ప్రజా సంక్షేమానికి అద్దం పడుతోందని కిమ్స్ సీఎండీ డా. బొల్లినేని భాస్కర్ రావు అన్నారు. ముఖ్యంగా 17 రకాల క్యాన్సర్ మందులపై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని రద్దు చేయడంతో పాటు, మరో ఏడు రకాల అరుదైన వ్యాధుల మందులకు మినహాయింపు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ నిర్ణయం వల్ల చికిత్స ఖర్చులు గణనీయంగా తగ్గి, ప్రాణరక్షక మందులు రోగులకు సులభంగా అందుబాటులోకి వస్తాయన్నారు. ఇది బాధిత కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించడమే కాకుండా, వైద్యులు కూడా మెరుగైన చికిత్స అందించడంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించేందుకు దోహదపడుతుందన్నారు. మౌలిక సదుపాయాల రంగానికి భారీగా నిధులు కేటాయించడం దేశాభివృద్ధికి కీలకమని తెలిపారు. పటిష్ఠమైన మౌలిక సదుపాయాల వల్ల కేవలం ఆర్థిక వృద్ధే కాకుండా, ఆరోగ్య సేవలు, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. సామాజిక బాధ్యత, దీర్ఘకాలిక అభివృద్ధిని సమన్వయం చేస్తూ ప్రజల సంక్షేమమే కేంద్రంగా ఈ బడ్జెట్ రూపకల్పన జరిగిందన్నారు.

# బడ్జెట్ తర్వాత 30 మంది విద్యార్థులను కలవనున్న నిర్మలమ్మ..ఎందుకంటే?

కేంద్ర ప్రభుత్వం 202627 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ను ఆదివారం పార్లమెంటులో ప్రవేశపెట్టనుంది. ఉదయం 11 గంటలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ బడ్జెట్‌ను లోక్‌సభకు సమర్పించనున్నారు. ఈ నేపథ్యంలో బడ్జెట్ విధి విధానాలు, రూపకల్పన విషయాలను తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కొంతమంది విద్యార్థులకు అవకాశం కల్పించినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఇందుకోసం దేశవ్యాప్తంగా ఉన్న వివిధ కళాశాలల నుంచి 30 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపాయి. ప్రభుత్వం ఎంపిక చేసిన విద్యార్థులు లోక్‌సభ గ్యాలరీ నుంచి ప్రత్యక్షంగా బడ్జెట్ ప్రసంగాన్ని వినే అవకాశం కల్పించారు. వీరు కర్తవ్య భవన్‌లోని ఆర్థిక మంత్రిత్వ శాఖను కూడా సందర్శించనున్నారు. ఆర్థిక శాఖ పనితీరు, విధాన రూపకల్పన ప్రక్రియలు, అత్యున్నత స్థాయిల్లో ఆర్థిక నిర్ణయాలు ఎలా రూపొందిస్తారు, అమలు చేస్తారు అనే విషయాలను ఆ విద్యార్థులు తెలుసుకోనున్నారు. పరిపాలన సంబంధమైన విషయాలపై విద్యార్థుల్లో అవగాహన తీసుకురావడానికి కేంద్రం ఈ వినూత్న నిర్ణయం తీసుకుంటున్నట్లు సమాచారం. బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ విద్యార్థులతో సమావేశమై.. బడ్జెట్ పై వారి అభిప్రాయాలను, సూచనలను తెలుసుకోనున్నారు.






## ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల వేళ
# ఈసీకి భారీగా నిధులు

కేంద్ర బడ్జెట్‌లో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియాకు భారీగా నిధులు కేటాయించడం ఆసక్తిగా మారింది. ఇవాళ నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ లో ఈసీకి నిధులు 25.33 శాతం పెరిగాయి. గతేడాది బడ్జెట్ లో రూ. 304.98 కోట్లు ఉండగా ఈసారి రూ. 382.22 కోట్లకు పెరిగింది. 202627 ఆర్థిక సంవత్సరానికి పోల్ ప్యానెల్ కు కేటాయించిన మొత్తం నిధులలో ఎన్నికల సంబంధిత ఖర్చుల కోసం రూ. 367.69 కోట్లుకేటాయించగా మిగిలిన మొత్తం పరిపాలన, కార్యకలాపాల ఖర్చుల కోసం వినియోగించనున్నారు. కాగా ఈ ఏడాది తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అస్సాం, కేరళతో పాటు పుదుచ్చేరి శాసనసభలకు ఎన్నికలు జరగనున్నాయి. 2027లో ఉత్తర ప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాలలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఈసీకి నిధులను కేంద్రం పెంచడం ఆసక్తిగా మారింది. కాగా అధికార బీజేపీ, ఈసీ కుమ్మక్కు అయ్యాయని ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇటువంటి తరుణంలో ఎన్నికల కమిషన్ కు బడ్జెట్ లో నిధులు పెంచడంపై ప్రతిపక్షాలు ఎలా రియాక్ట్ అవుతాయో చూడాలి మరి.

# దేశంలో ప్రధాన సమస్యల్ని పట్టించుకోని బడ్జెట్ ఇది

**: రాహుల్ గాంధీ**

2026-27 ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం పార్లమెంట్లో వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టారు. తాజాగా ఈ బడ్జెట్ పై లోక్ సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ బడ్జెట్ దేశంలో వాస్తవ సంక్షోభాలను పట్టించుకోని బడ్జెట్ అని విమర్శించారు. దేశంలో ప్రస్తుతం నెలకొన్న ప్రధాన ఆర్థిక, సామాజిక సమస్యలను బడ్జెట్ పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. నిరుద్యోగం, తయారీ రంగ వృద్ధి మందగించడం, పెట్టుబడుల ఉపసంహరణ, కుటుంబాల పొదుపు తగ్గుదల, రైతుల కష్టాలు వంటి కీలక అంశాలను ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఉద్యోగాలు లేని యువత, పడిపోతున్న తయారీ రంగం, పెట్టుబడులు వెనక్కి తీసుకుంటున్న పెట్టుబడిదారులు, క్షీణిస్తున్న కుటుంబ పొదుపు, ఇబ్బందుల్లో ఉన్న రైతులు, ప్రపంచ ఆర్థిక సంక్షోభ సూచనలు.. ఇవన్నీ ఈ బడ్జెట్‌లో నిర్లక్ష్యం చేసినట్లు స్పష్టంగా కనిపిస్తోందని ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.



*** మధ్యతరగతి వర్గం పూర్తిగా మోసపోయింది : అఖిలేశ్ యాదవ్**

ఇదే సమయంలో.. ఇతర ప్రతిపక్ష నేతలు కూడా బడ్జెట్‌పై విమర్శలు చేశారు. దేశ ఆర్థిక వృద్ధిని పునరుజ్జీవింపజేయడానికి, ఉపాధి అవకాశాలు కల్పించడానికి, బలహీన వర్గాలకు ఉపశమనం కల్పించడానికి అవసరమైన నిర్మాణాత్మక సంస్కరణలు ఇందులో లేవని వారు పేర్కొన్నారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ కూడా బడ్జెట్‌ను తీవ్రంగా తప్పుబట్టారు. బడ్జెట్ కారణంగానే స్టాక్ మార్కెట్ పతనమైందని ఆరోపించారు. "బీజేపీ బడ్జెట్ ఫలితం ఇదే. షేర్ మార్కెట్ భారీగా కుప్పకూలింది. ఆదివారం మార్కెట్ తెరుస్తుందా లేదా అన్నది కాదు, ఎంతగా పడిపోతుందన్నదే ప్రశ్న అని మేము ముందే చెప్పాం" అని ఆయన 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు. ఈ బడ్జెట్ దేశంలోని కేవలం ఐదు శాతం మందికే ఉపయోగపడేలా రూపొందించబడిందని అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. బీజేపీకి అనుకూలంగా ఉన్న వారికి లాభాలు చేకూర్చేందుకు, కమిషన్లు భద్రపరుచుకోవడానికే ఈ బడ్జెట్ ను రూపొందించారని అన్నారు.

ద్రవ్యోల్బణం నియంత్రణ తప్పిన పరిస్థితుల్లో పన్ను రాయితీలు ఇవ్వకపోవడం "పన్ను దోపిడీ"తో సమానమన్నారు. ధనవంతులకు వ్యాపారం, ప్రయాణాల కోసం అనేక రాయితీలు ఇచ్చారని, నిరుద్యోగులకు మాత్రం కేంద్రం మొండిచేయి చూపించిందని వాపోయారు. మధ్యతరగతి వర్గం పూర్తిగా మోసపోయినట్టుగా భావిస్తోందని ఆయన పేర్కొన్నారు. పేదలు, వెనుకబడిన వర్గాలు తగిన సహాయం లేక మరింత వెనుకబడుతున్నాయని అన్నారు. సామాజిక భద్రత పథకాలలో కోతలను కూడా ఆయన విమర్శించారు. అవి కేవలం రూపకల్పన కోసం మాత్రమే ఉన్నాయని, వాస్తవ ప్రయోజనం లేదని తెలిపారు. రైతులు, కూలీలు, కార్మికులు, వ్యాపారులు, చిన్న దుకాణదారులకు ఈ బడ్జెట్‌లో ఎలాంటి ఉపశమనం లేదని అఖిలేశ్ యాదవ్ అన్నారు.

# మాపై దాడిచేస్తే 'ప్రాంతీయ యుద్ధమే'.. ట్రంప్‌కు ఖమేనీ హెచ్చరిక


అణు ఒప్పందంపై చర్చలకు రాని పక్షంలో భీకర స్థాయిలో విరుచుకుపడతామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికలను ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ తీవ్రంగా ఖండించారు. అమెరికా ఏదైనా దాడి చేస్తే.. అది మధ్యప్రాచ్యంలో ప్రాంతీయ యుద్ధానికి దారితీస్తుందని హెచ్చరించారు. "మేం యుద్ధాన్ని ప్రేరేపించేవాళ్లం



కాదు. ఏ దేశంపైనా దాడులు చేయాలని కోరుకోవడం లేదు. కానీ.. మాపై దాడి చేసినా, మమ్మల్ని వేధించినా.. వారికి గట్టి జవాబు చెబుతాం. ఒకవేళ యుద్ధాన్ని ప్రారంభిస్తే.. అది 'ప్రాంతీయ యుద్ధం'గా మారుతుందనే విషయాన్ని అమెరికన్లు గ్రహించాలి'' అని ఖమేనీ పేర్కొన్నట్లు ఇరాన్ అధికారిక మీడియా తెలిపింది. మరోవైపు, హర్మూజ్ జలసంధిలో సైనిక విన్యాసాలకు ఇరాన్ ప్రణాళికలు సిద్ధం చేసింది. అయితే, ఈ విన్యాసాల సమయంలో అమెరికన్ యుద్ధనౌకలు, విమానాలపై బెదిరింపు చర్యలకు దిగొద్దని, వాణిజ్య నౌకల రాకపోకలకు అంతరాయం కలిగించవద్దని అమెరికా సైనిక కేంద్ర కమాండ్ హెచ్చరించింది. తమ దేశానికి చెందిన మరిన్ని యుద్ధనౌకలు ఇరాన్ దిశగా కదులుతున్నట్లు ట్రంప్ వెల్లడించిన వేళ ఈ పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## కేంద్ర బడ్జెట్ పై
# తీవ్ర స్థాయిలో మండిపడ్డ బెంగాల్ సీఎం

ఈ రోజు ఉదయం 11 గంటలకు కేంద్ర ఆర్థిక మంత్రి.. లోక్ సభలో కేంద్ర బడ్జెట్ 2026 2027ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. మొత్తం వ్యయాన్ని ₹53 లక్షల కోట్లుగా ప్రతిపాదించింది. ఈ బడ్జెట్‌పై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బడ్జెట్‌లో ప్రతిపాదించిన మూడు కారిడార్ల అంశం కేవలం "అబద్ధాల పుట్ట" అని, ఇప్పటికే తాము ఆ ప్రాజెక్టులపై పని చేస్తున్నామని ఆమె విమర్శించారు.



పురూలియాలోని 'జంగల్ సుందరి' ఎకనామిక్ కారిడార్ ప్రాజెక్ట్ కోసం రాష్ట్ర ప్రభుత్వమే ₹72,000 కోట్లు పెట్టుబడి పెడుతోందని, బెంగాల్‌కు కేంద్రం ఒక్క పైసా కూడా ఇవ్వలేదని ఆమె ఆరోపించారు. జీఎస్టీ (GST) ద్వారా రాష్ట్రాల నుంచి డబ్బులు వసూలు చేస్తూ, తిరిగి తామే నిధులు ఇస్తున్నట్లు కేంద్రం గొప్పలు చెప్పుకుంటోందని మమత మండిపడ్డారు. దేశ ఆర్థిక, రాజ్యాంగ నిర్మాణాన్ని, స్వతంత్ర సంస్థలను కేంద్ర ప్రభుత్వం నాశనం చేస్తోందని, అందువల్ల వారికి అధికారంలో కొనసాగే నైతిక హక్కు లేదని ఆమె వ్యాఖ్యానించారు. కేంద్రం కేవలం మాటలకే పరిమితం అవుతుందని, పనులు చేయడం లేదని ఈ సందర్భంగా సీఎం మమతా బెనర్జీ విమర్శించారు.

# 'మీ చరిత్ర అందరికీ తెలిసిందే'.. పాక్‌కు భారత్ చురకలు

బలోచిస్థాన్ ఘటనల్లో భారత్ హస్తం ఉందంటూ పాకిస్థాన్ చేసిన ఆరోపణలను విదేశాంగశాఖ తీవ్రంగా ఖండించింది. అంతర్గత వైఫల్యాల నుంచి అందరి దృష్టిని మళ్లించేందుకు ఆ దేశానికి ఇది అలవాటైన వ్యూహమేనని పేర్కొంది. ''పాకిస్థాన్ చేసిన నిరాధార ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఎప్పటిలాగే స్వీయ అంతర్గత వైఫల్యాల నుంచి అందరి దృష్టిని మళ్లించేందుకు రచించిన సాధారణ వ్యూహమే ఇది. హింసాత్మక ఘటన జరిగిన ప్రతిసారీ పనికిమాలిన వాదనలు చేసే బదులు.. ఆ ప్రాంత ప్రజల దీర్ఘకాలిక డిమాండ్లను పరిష్కరించడంపై దృష్టి సారించడం మంచిది. అణచివేత, క్రూరత్వం, మానవ హక్కుల ఉల్లంఘనల విషయంలో పాకిస్థాన్ చరిత్ర



అందరికీ తెలిసిందే'' అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఓ ప్రకటన విడుదల చేశారు. బలోచిస్థాన్ ప్రావిన్సులోని ఆయా ప్రాంతాల్లో శనివారం పాక్ సైన్యం చేపట్టిన ఆపరేషన్‌లో 92 మంది మిలిటెంట్లు మృతి చెందారు. మరో 15 మంది భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రమంలోనే బలోచిస్థాన్‌లో శాంతిని దెబ్బతీసేందుకు ఉగ్రశక్తులకు భారత్ మద్దతు ఇస్తోందని పాక్ సైన్యం ఆరోపించింది.




## సమస్యలు చక్కదిద్దే ప్రయత్నం
# ఒక్కటి కూడా లేదు : ఖర్గే విమర్శలు

కేంద్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ దారి తప్పిందని విమర్శించారు. యూపీఏ హయాంలో 7.5%గా ఉన్నఉత్పాదకత వృద్ధి ఇప్పుడు 3.5%కి పతనమైందని మండిపడ్డారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 92కి దిగజారిందని గుర్తుచేశారు. పెరుగుతున్న ఆర్థిక గందరగోళంపై కేంద్రానికి పట్టింపు లేదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సమస్యలు చక్కదిద్దే దిశగా ఒక్క గట్టి ప్రయత్నం కూడా లేదని మల్లికార్జున ఖర్గే సీరియస్ అయ్యారు. కేంద్ర బడ్జెట్ ఫ్రీ ఫాల్‌లో ఉన్న ఆర్థిక సూచికలకు నిజమైన పరిష్కారాలు అందిస్తుందా అని ఆయన ప్రశ్నించారు. గడిచిన 12 ఏళ్లుగా బీజేపీనే అధికారంలో ఉందని, ఇకపై లెగసీ సాకుతో తప్పించుకోలేదని ఖర్గే అన్నారు. ఎన్డీయే సర్కారే ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టిందని, యూపీఏ పాలనలో తయారీ రంగం వృద్ధి 7.4% ఉండగా, ఎన్డీఏ పాలనలో 3.54%కి పడిపోయిందని ఆయన పేర్కొన్నారు.

# భారత్‌కు వెనెజువెలా చమురు: ట్రంప్

భారత చమురు దిగుమతుల గురించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. వెనెజువెలా నుంచి చమురు దిగుమతులకు భారత్ ముందుకొచ్చిందని పేర్కొన్నారు. ఎయిర్‌ఫోర్స్ వన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ''మేము ఇప్పటికే వెనెజువెలాతో ఒక డీల్ కుదుర్చుకున్నాం. ఇందులో భారత్ కూడా చేరనుంది. భారత్ ఇకపై వెనెజువెలా చమురును దిగుమతి చేసుకుంటుంది. దీనికి సంబంధించిన ఒప్పందంపై ఒక అవగాహనకు వచ్చాం'' అని ట్రంప్ తెలిపారు. అయితే, దీనిపై భారత్ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇక, వెనెజువెలా చమురు కోసం చైనా కూడా తమతో చర్చలు జరిపే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు తెలిపారు. దాన్ని మేము స్వాగతిస్తామన్నారు. మరోవైపు వెనెజువెలాలో పాలనపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ దేశం ఇప్పుడు తన అధీనంలోనే ఉందన్నారు. తాను కోరుకున్నట్లుగానే ఆ దేశ తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ పరిపాలన సాగిస్తున్నారని అన్నారు.



అక్కడి చమురు నిల్వలు పూర్తిగా అమెరికా చేతికి వచ్చే వరకు ఆమెనే తాత్కాలిక నాయకురాలిగా కొనసాగుతారని తెలిపారు. వెనెజువెలాపై సైనిక దాడి చేసి.. ఆ దేశ నేత నికోలస్ మదురోను అమెరికా నిర్బంధించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత రోడ్రిగ్జ్ తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారు. భారత ప్రధాని మోదీ రోడ్రిగ్జ్‌లు ఇటీవల ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఇంధనం, వాణిజ్యం, పెట్టుబడులతో సహా పలు ద్వైపాక్షిక అంశాలపై చర్చించుకున్నారు.

# ఈయూ మిలిటరీపై ఇరాన్ 'ఉగ్ర'ముద్ర!

ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఐరోపా దేశాలకు చెందిన మిలిటరీని ఉగ్రవాద గ్రూపులుగా పరిగణించనున్నట్లు పేర్కొంది. ఈ మేరకు ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాగర్ ఖాలీబాఫ్ తెలిపారు. ఇటీవల ఆ దేశ సైన్యంలో కీలక విభాగమైన 'ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ)'ను ఈయూ ఉగ్రవాద సంస్థగా ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనికి ప్రతిస్పందనగా ఇరాన్ తాజా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అమెరికాను నమ్మి తమ సొంత ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఈయూ నిర్ణయాలు తీసుకుంటోందని ఖాలీబాఫ్ విమర్శించారు. ఈ సందర్భంగా అమెరికా, ఇజ్రాయెల్ దేశాలకు వ్యతిరేకంగా చట్టసభ సభ్యులు నినాదాలు చేశారు.

# నా కెరీర్‌లో ఇది అత్యంత సవాలుతో కూడిన పాత్ర

అదితి రావు హైదరీ





టాకీస్: అదితి రావ్ హైదరీ మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. గతంలో 'రాక్‌స్టార్' చిత్రంలో అతిథి పాత్రలో కనిపించిన ఆమె, ఇప్పుడు ఇమ్తియాజ్ అలీ క్రియేట్ చేసిన 'ఓ సాథీ రే' ద్వారా ఆయనతో కలిసి పని చేస్తోంది. నెట్‌ఫ్లిక్స్ నిర్మాణంలో వస్తున్న ఈ పీరియాడికల్ లవ్ స్టోరీపై అదితి స్పందిస్తూ.. ఇమ్తియాజ్ అలీతో పనిచేయాలనే తన చిరకాల కోరిక ఈ సినిమాతో నెరవేరిందని వెల్లడించింది. ఈ మూవీ షూటింగ్ సమయంలో ఇమ్తియాజ్ అలీ పనితీరు తనను ఎంతగానో ఆకట్టుకుందని అదితి పేర్కొంది.

"ఇమ్తియాజ్ మానిటర్ వైపు కూడా చూడరు, నేరుగా నటుల వైపు చూస్తూ సీన్ ఎలా వస్తుందో గమనిస్తారు. ఆయన ఎనర్జీ, అప్పటికప్పుడు కొత్త ఆలోచనలు చేసే తీరు నటిగా నాకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది" అని తెలిపింది. 'ఓ సాథీ రే' భావోద్వేగపరంగా చాలా లోతైన కథ అని, తన కెరీర్‌లో ఇది అత్యంత సవాలుతో కూడిన పాత్ర అని ఆమె చెప్పుకొచ్చింది. అయితే ఇలాంటి క్లిష్టమైన పాత్రలు చేయడమే ఒక నటిగా తనకు గొప్ప సంతృప్తిని ఇస్తుందని అదితి స్పష్టం చేసింది. ఇక ఈ సినిమాలో తన కో-స్టార్స్ గురించి కూడా అదితి ఆసక్తికర విషయాలు పంచుకుంది. 'గర్ల్ ఆన్ ఏ ట్రైన్' తర్వాత మళ్ళీ అవినాష్ తివారీతో కలిసి నటించడం ఆనందంగా ఉందని, ఆయన ఒక మంచి స్నేహితుడని తెలిపింది. అలాగే అర్జున్ రాంపాల్‌ను యూనివర్సల్ క్రష్‌గా చెప్తూ ఆయన సెట్స్‌లో చాలా ప్రొటెక్టివ్‌గా ఉంటారని ప్రశంసించింది. ఈ ప్రాజెక్ట్‌తో పాటు పంకజ్ త్రిపాఠితో కలిసి 'పారివారిక్ మనోరంజన్' అనే చిత్రంలోనూ, అలాగే ఒక సౌత్ థ్రిల్లర్ మూవీలోనూ తాను నటిస్తున్నట్లు అదితి అప్‌డేట్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ అదివి రావు కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.

MOVIE TIME


# హిట్ కోసం విజయ్ దేవరకొండ ప్రయత్నాలు..

## ప్రత్యేక పాత్రలలో సీనియర్ యాక్టర్స్




**టాకీస్:** యూత్‌లో ప్రత్యేక ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ కెరీర్‌లో మరో కీలక మలుపు చోటు చేసుకోనుంది. గత కొంతకాలంగా సరైన కమర్షియల్ హిట్ కోసం ఎదురుచూస్తున్న ఆయన, తాజాగా వరుస ప్రాజెక్టులతో బిజీ అవుతూ కొత్త స్ట్రాటజీని అమలు చేస్తున్నాడు. ఇటీవల విడుదలైన 'కింగ్‌డమ్' ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడంతో, ఇప్పుడు మరింత జాగ్రత్తగా కథల ఎంపికలో ముందుకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో దర్శకుడు రవికిరణ్ కోలా తెరకెక్కిస్తున్న 'రౌడీ జనార్ధన్' సినిమా ప్రత్యేకంగా నిలుస్తోంది. గ్రామీణ నేపథ్యంలో సాగే పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం విజయ్ కెరీర్‌లో విభిన్నమైన ప్రయత్నంగా భావిస్తున్నారు. టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోలో చూపించిన మాస్ ఎలిమెంట్స్, గ్రామీణ వాతావరణం సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచాయి. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో పాటు బలమైన టెక్నికల్ టీమ్ పనిచేస్తుండటం విశేషం. హీరోయిన్‌గా కీర్తి సురేష్ ఎంపిక కావడం సినిమాకు అదనపు ఆకర్షణగా మారింది. నటీనటుల ఎంపిక విషయంలో దర్శకుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఇండస్ట్రీ వర్గాల సమాచారం.ఇక కథలో భావోద్వేగాలకు కీలకమైన పాత్రల కోసం అనుభవజ్ఞులైన నటులను తీసుకుంటున్నట్లు టాక్ వినిపిస్తోంది. సీనియర్ నటి శోభన ముఖ్యమైన పాత్రలో కనిపించనున్నారన్న వార్త సినిమాకు మరింత ప్రాధాన్యం తీసుకొచ్చింది. అలాగే సీనియర్ హీరో రాజశేఖర్ కూడా ప్రత్యేక పాత్రలో కనిపించే అవకాశాలున్నట్లు చర్చ నడుస్తోంది. భారీ తారాగణం, గ్రామీణ శైలిలో సాగే యాక్షన్ కథాంశం, పీరియాడిక్ టచ్ అన్నీ కలిసి 'రౌడీ జనార్ధన్'ను విజయ్ దేవరకొండకు మాస్ కమ్‌బ్యాక్ మూవీగా నిలబెడతాయనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

## విశ్వక్‌సేన్ 'ఫంకీ' నుంచి రొమాంటిక్ మెలోడి 'రట్టాటటావ్'.!




**టాకీస్:** టాలీవుడ్ యువ నటుడు విశ్వక్‌సేన్, కాయదు లోహర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం ఫంకీ. ఈ సినిమాకు కేవీ అనుదీప్ దర్శకత్వం వహిస్తుండగా.. సితార ఎంటర్‌టైనమెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ఈ చిత్రం వాలంటైన్స్ డే కానుకగా ఫిబ్రవరి 13న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ప్రమోషన్స్ షురూ చేసింది చిత్రయూనిట్. ఇందులో భాగంగానే సినిమా నుంచి సెకండ్ సింగిల్ రాట్టటాటవ్ అనే సాంగ్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చింది. ఈ పాటకు దేవ్ పవర్ సాహిత్యం అందించగా.. రామ్ మిరియాల పాడాడు. భీమ్స్ సిసిరిలియో సంగీతం అందించాడు. కామెడీ నేపథ్యంలో రాబోతున్న ఈ చిత్రంలో వీకే నరేష్, వీటీవీ గణేష్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# మెగా ఫ్యామిలీలో డబుల్ జాయ్



**టాకీస్:** టాలీవుడ్ మెగా కుటుంబంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ఉపాసన కొణిదెల దంపతులు కవలలకు తల్లిదండ్రులయ్యారు. శనివారం రాత్రి హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో ఉపాసన ఒక మగ శిశువుకు, ఒక ఆడ శిశువుకు జన్మనిచ్చారు. ఈ శుభవార్తతో కొణిదెల కుటుంబం, కామినేని కుటుంబం ఆనందంలో మునిగిపోయాయి. మెగా అభిమానులు "డబుల్ జాయ్" అంటూ సంబరాలు జరుపుకుంటున్నారు. కవలల జననం అనంతరం రామ్ చరణ్ సోషల్ మీడియాలో చేసిన భావోద్వేగ ట్వీట్ ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. మాకు ఒక పాప, ఒక బాబు పుట్టారని ఆనందంగా పంచుకుంటున్నాను. ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉండటం మా జీవితాన్ని అపారమైన కృతజ్ఞతతో నింపింది. మా జీవితంలో ఉన్న మహిళలే మా గొప్ప బలం. ప్రతి క్షణంలో మాకు అండగా నిలిచిన అభిమానులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక ధన్యవాదాలు" అంటూ ఆయన రాసిన మాటలు అభిమానుల హృదయాలను తాకాయి. ముఖ్యంగా తన జీవితంలో మహిళల పాత్రను ప్రత్యేకంగా ప్రస్తావించడం సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది.

ఈ గుడ్ న్యూస్ తెలిసిన వెంటనే మెగా అభిమానులు పెద్ద ఎత్తున అపోలో ఆసుపత్రి వద్దకు చేరుకుని బాణాసంచా కాల్చుతూ పండగ వాతావరణాన్ని సృష్టించారు. సోషల్ మీడియా వేదికగా కూడా వేల సంఖ్యలో శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు, అభిమానులు వరుసగా విషెస్ తెలియజేస్తున్నారు. రామ్ చరణ్ ఉపాసన దంపతులకు కవలలు పుట్టడంపై మెగాస్టార్ చిరంజీవి కూడా తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. మీడియాతో మాట్లాడుతూ,ఎప్పటి నుంచో మా ఇంట్లో ఇలాంటి శుభం జరగాలని కోరుకున్నాం. భగవంతుడి దయతో, హనుమాన్ కృప వల్ల ఒక ఆడబిడ్డ, ఒక మగబిడ్డ జన్మించారు. ఇది మాకు ఎనలేని ఆనందాన్ని ఇచ్చింది" అంటూ తన సంతోషాన్ని పంచుకున్నారు. ఉపాసన ప్రసవాన్ని విజయవంతంగా నిర్వహించిన అపోలో ఆసుపత్రి వైద్య బృందానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అపోలో ఆసుపత్రి వైద్యులు మీడియాతో మాట్లాడుతూ ఉపాసన, ఇద్దరు చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని స్పష్టం చేశారు. మొదట బాబు, ఆ తర్వాత పాప జన్మించినట్లు వెల్లడించారు.

# సాఫ్ట్‌వేర్ నుంచి వ్యవసాయం..

## ఆకట్టుకుంటున్న 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్' ట్రైలర్




టాకీస్: విలక్షణమైన పాత్రలతో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న నటుడు త్రిగుణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్'. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. మధుదీప్ చెలికాని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం, ఆధునిక సాఫ్ట్‌వేర్ జీవనశైలికి మరియు గ్రామీణ మూలాలైన వ్యవసాయానికి మధ్య ఉన్న సంబంధాన్ని సరికొత్త కోణంలో ఆవిష్కరించనుంది. సిటీలో సెటిల్ అవ్వాలనే ఆలోచన పక్కన పెట్టి, వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తూనే తన ఊరిలో వ్యవసాయాన్ని కొత్త పుంతలు తొక్కించే యువకుడి కథా నేపథ్యంతో ఈ సినిమా రూపొందింది. ముఖ్యంగా "వ్యవసాయం చేసే విధానం మారితే, దాన్ని చూసే తీరు మారుతుంది" వంటి డైలాగులు ప్రేక్షకులలో ఆలోచన రేకెత్తిస్తున్నాయి. లోటస్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై అరవింద్ మండెం నిర్మిస్తున్న ఈ చిత్రంలో పాయల్ రాధాకృష్ణ హీరోయిన్‌గా నటించగా, అనీష్ కురువిల్లా, శివాజీ రాజా ఇతర కీలక పాత్రలు పోషించారు. బాబా సెహగల్ పాడిన సాంగ్ ఇప్పటికే యూట్యూబ్‌లో ట్రెండ్ అవుతుండగా, చిన్న సినిమాల పట్ల ప్రేక్షకులు చూపిస్తున్న ఆదరణ చూస్తుంటే ఈ చిత్రంపై మంచి అంచనాలు ఏర్పడ్డాయని హీరో త్రిగుణ్ ధీమా వ్యక్తం చేశారు. తక్కువ టికెట్ ధరలతో ప్రేక్షకులను థియేటర్లకు రప్పించేలా ప్లాన్ చేస్తున్న ఈ మూవీ విడుదల తేదీని మేకర్స్ త్వరలోనే ప్రకటించనున్నారు.

# సూర్య 46కు క్రేజీ టైటిల్..




**టాకీస్:** కోలీవుడ్ యాక్టర్ సూర్య లక్కీ భాస్కర్ ఫేం వెంకీ అట్లూరితో చేస్తున్న చిత్రం సూర్య 46. ఈ మూవీలో ప్రేమలు ఫేం మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మూవీకి సంబంధించి ఏదో ఒక వార్త నెట్టింట రౌండప్ చేస్తూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. ఇంకా టైటిల్ ఖరారు కానీ ఈ చిత్రానికి మేకర్స్ ఓ పేరు ఫైనల్ చేశారన్న వార్త ఆన్‌లైన్‌లో రౌండప్ చేస్తోంది. తాజా టాక్ ప్రకారం ఈ చిత్రానికి విశ్వనాథం అండ్ సన్స్ టైటిల్‌ను ఫిక్స్ చేశారని ఇన్‌సైడ్ టాక్. ఈ క్రేజీ టైటిల్ అఫీషియల్ అయితే ఇంతకీ సూర్యతో వెంకీ అట్లూరి ఎలాంటి కథను చూపించబోతున్నాడన్నది ఆసక్తికరంగా మారింది. అంతేకాదు ఈ మూవీని జులై 2026లో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేలా ప్లాన్ చేస్తున్నారట. సూర్య కరుప్పు విడుదలైన తర్వాత ప్రమోషన్స్‌ను షురూ చేయనున్నారట. ఈ మూవీలో సీనియర్ యాక్టర్లు రాధికా శరత్ కుమార్, రవీనా టాండన్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ మూవీకి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. ఈ చిత్రంలో సూర్య పాత్ర గజినీలో సంజయ్ రామస్వామి లైన్‌లో సాగనుందని టాక్ నడుస్తోంది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రం 45 ఏండ్ల వ్యక్తికి 20 ఏండ్ల యువతికి మధ్య రిలేషన్ షిప్ నేపథ్యంలో ఉండబోతున్నట్టు సమాచారం.

సూర్య 46 చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ , ఫార్చూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగవంశి, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో సూర్య టాలీవుడ్ ఎంట్రీ ఇస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. సూర్య మరోవైపు సుధాకొంగర డైరెక్షన్‌ల సూర్య 47లో నటిస్తున్నాడని తెలిసిందే.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.